# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :18 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 13-03-2025 | పేజీలు:4 వెల: 2.00


## డీలిమిటేషన్‌తో సీట్లు పెరుగుతాయి...

న్యూఢిల్లీ,నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాదికి అన్యాయం జరుగుతుందన్న ఆరోపణలను కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తోసిపుచ్చారు. పార్లమెంటు సీట్ల సంఖ్య తగ్గుతుందని జరుగుతున్న చర్చపై కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. డీలిమిటేషన్‌తో తమిళనాడుతో సహా అన్ని రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య పెరుగుతుందని ఆయన అన్నారు.ఒక ప్రముఖ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ, డీలిమిటేషన్ పక్రియ ప్రణాళికా బద్ధంగా కొనసాగుతుందని తాను భావిస్తున్నట్టు చెప్పారు. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌కు ఏదైనా అభ్యంతరం ఉంటే వాటిని లేవనెత్తే స్వేచ్ఛ ఆయనకు ఉంటుందని అన్నారు. దీనిపై సంబంధిత అధికారులు చర్చలు జరుపుతారని, నిర్ణయం న్యాయంగానే ఉంటుందని చెప్పారు. శాసనసభ అయినా, లోక్‌సభ అయినా ప్రతి రాష్ట్రంలోనూ నియోజకవర్గాల పునర్విభజన తర్వాత సీట్ల సంఖ్య సహజంగానే పెరుగుతుందని అన్నారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళలో కూడా సీట్లు పెరుగుతాయని, నియోజకవర్గాల పునర్విభజన వల్ల ఉత్తరాది రాష్ట్రాలు మాత్రమే

## తెలంగాణ ప్రజల కలల సాకారానికే బడ్జెట్...



హైదరాబాద్, తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. సభ ప్రారంభం కాగానే గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉభయసభలను ఉద్దేశించి మాట్లాడారు. సమావేశాలకు ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల కలల సాకారానికే ఈ బడ్జెట్ ప్రవేశపెడుతున్నామన్నారు. ప్రజలే కేంద్రం పాలన సాగుతోందని, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులు, మహిళలు, యువతకు అన్ని విధాలా సహకారం అందిస్తామని చెప్పారు. రైతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఘనమైన సంస్కృతికి నిలయం తెలంగాణ అని పేర్కొన్నారు. ప్రజల కోసం గద్దర్, అంజయ్య వంటి ఎందరో కృషి చేశారని, జననీ జయకేతనం రాష్ట్ర గీతంగా చేసుకున్నామన్నారు. సామాజిక న్యాయం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ తెలిపారు.సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నామని, అభివృద్ధి, ప్రగతి వైపు తెలంగాణ అడుగులు వేస్తోందని జిష్ణుదేవ్ వర్మ తన ప్రసంగంలో పేర్కొన్నారు. రాష్ట్రానికే రైతులే ఆత్మ అని.. వారి అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల కోసం నిరంతరం శ్రమించే వారే అన్నదాతలని.. రాష్ట్ర అభివృద్ధిలో రైతుల భాగస్వామ్యం ఉందని, రైతులకు మద్దతు ఇవ్వడం, వారిని శక్తివంతులుగా తీర్చేదిద్దే బాధ్యత తమ ప్రభుత్వానిదేనన్నారు. దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని.. రైతులకు రుణమాఫీ చేశామని, రైతుల రైతుల పట్ల మా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 25.35లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించామని.. ఎకరానికి రూ.12వేల చొప్పున రైతులకు అందిస్తున్నామని.. రైతునేస్తం అమలు చేస్తున్నట్లు చెప్పారు. వరి రైతులకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నామని, రైతుల కోసం వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహాలక్ష్మి గేమ్ ఛేంజర్ పథకమని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు చెప్పారు.తెలంగాణ పురోగమించడమే కాదు.. రూపాంతరం చెందుతోందన్నారు. సమ్మిళిత, స్వయం సమృద్ధి, సాధికార తెలంగాణ విజన్‌తో పని చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సమృద్ధికి దిక్సూచిగా ఉండేలా తెలంగాణ నమూనా ఉండాలని, తెలంగాణ భౌగోళిక పాత్రమే కాదు.. ఒక భావోద్వేగమన్నారు. తెలంగాణ స్థిరత్వం, దృఢసంకల్పానికి గుర్తు అన్నారు.రైతుల స్వేదం, కష్టం మన ప్రజలను పోషిస్తోందన్నారు. 260లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తితో దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని తెలిపారు. ఇది మన రైతుల స్థిరత్వం, అంకిత భావానికి ఓ సాక్ష్యమన్నారు. రూ.2లక్షల పంట రుణమాఫీని అమలు చేస్తున్నట్లు గవర్నర్ పేర్కొన్నారు. రుణమాఫీతో రూ.20,616.89కోట్లతో 25.35లక్షల మంది రైతులకు లబ్ధి కలిగిందన్నారు. ఇది ప్రభుత్వం చేసిన వాగ్దానాల నిర్దిష్ట కాల అమలుకు సాక్ష్యమన్నారు. రైతు భరోసా కింద నేరుగా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఏడాదికి ఎకరాకు రూ.12వేలకు పెంచినట్లు వివరించారు.

## కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగం...

హైదరాబాద్,గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ల కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. గవర్నర్ ప్రసంగం అనంతరం శాసనసభ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన 420 హామీలు ఈ ప్రభుత్వం, ఆరు గ్యారంటీల గురించి ఏమైనా కొత్త విషయాలు చెబుతారేమోనని అనుకున్నామన్నారు. 'గత 15నెలల పేలవమైన, అట్టర్‌ఫ్లాప్ పరిపాలన గురించి ప్రాయశ్చిత్తం చేసుకునేవిధంగా గవర్నర్ ప్రసంగం ఉంటుందని భావించాం. ఇది గవర్నర్ ప్రసంగం లేదు. ఒకమాటలో చెప్పాలంటే గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా ఉంది తప్పా.. గవర్నర్ ప్రసంగంలా లేదు. గవర్నర్ నోటి వెంట ఒకటికాదు రెండు చాలా అబద్ధాలు చెప్పించారు. గవర్నర్ నోటివెంట అసత్యాలు పలకాల్సి రావడంపై బాధపడుతున్నాం. కాంగ్రెస్ సర్కారు ఘోర వైఫల్యం వల్ల ఈ రోజు రాష్ట్రంలో రైతాంగం ఆందోళనలో ఉంది' కేటీఆర్ తెలిపారు.

గవర్నర్ స్థాయిని ప్రభుత్వం దిగజార్చింది..

'రాష్ట్రంలో ఎక్కడికక్కడ పంటలు ఎండిపోతున్నయ్. ఇప్పటికే 480 పైచిలుకు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. కనీసం ఒక మాట రైతులకు స్వాంతన చేకూర్చే, ఉపశమనం, భరోసా ఇచ్చేమాట గవర్నర్ నోటినుంచి వస్తుందేమోననని ఆశించాం. పంటలు ఎండిపోకుండా కాపాడుతాం. పంటలకు నీరు ఇస్తాం. బుద్ధి తెచ్చుకున్నాం. ఇకనైనా బుద్ధితో మెదులుతామని చెప్పి ఒక్క మాట చెబుతారని అనుకున్నాం. వారి నోటివెంట ఒక్క మాట రాలేదు. అసలు ఈ రోజు వరకు రాష్ట్రంలోని ఏ గ్రామంలో కూడా 25శాతం నుంచి 30శాతానికి మించి రుణమాఫీ జరుగలేదు. దీనిపై పోయిన శాసనసభలో ప్రభుత్వాన్ని అడిగినం. సీఎం సొంత ఊరికి పోదామా? సొంత నియోజకర్గానికి పోదామా? ప్లేస్, సమయం మీ ఇష్టం.. ఊరు మీష్టం అని చెప్పాం. ఒక ఊరిలో వందశాతం రుణమాఫీ జరిగితే మేం అందరం రాజీనామా చేస్తామని చెప్పాం. కానీ, మళ్లీ ఈ రోజు గవర్నర్ నోటివెంట రుణమాఫీ అయిపోయింది.. లక్షలాది మంది రైతులు సంతోషంగా ఉన్నరని గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించి.. గవర్నర్ స్థాయిని సైతం దిగజార్చి మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం తన భ్రష్టత్వాన్ని, నీచత్వాన్ని బయటపెట్టుకుంది' అంటూ కేటీఆర్ మండిపడ్డారు.

గవర్నర్‌కే అవమానం..



'పెట్టుబడి సాయం అందని రైతులు, రుణమాఫీ కాక.. కేసీఆర్ హయాంలో ఉన్న రైతుబంధును సైతం కనీసం అమలు చేసే పరిస్థితి లేక ఆగమాగమైపోతుంటే.. రైతుబంధు మొత్తం అందింది.. అది మాత్రమే కాకుండా రైతు కూలీలకు సహాయం చేస్తున్నామని గవర్నర్ నోటి వెంట అబద్ధాలు చెప్పించడమంటే గవర్నర్‌కు కూడా అవమానం. గవర్నర్ దీన్ని గుర్తించాలి. సాగునీటి సంక్షోభం రోజురోజుకు తీవ్రమవుతుంది. కేసీఆర్‌పై ద్వేషంతో, బీఆర్ఎస్‌పై గుడ్డి కోపంతో మేడిగడ్డకు మరమ్మతులు చేయకుండా 15నెలలు ఎండపెట్టడం వల్ల గోదావరి పరీవాహక ప్రాంతంలో ఎండిపోతున్న ప్రతి ఎకరా పంటకు బాధ్యత తీసుకోవాల్సింది రేవంత్‌రెడ్డి అనే ఈ ముఖ్యమంత్రి. రేవంత్‌రెడ్డి అనే చేతగాని ముఖ్యమంత్రి వల్ల రాష్ట్రంలో లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండుతున్నాయి.పంట ఎండిపోయి రైతులు అవస్థలుపడుతున్న రైతులు.. పంటలకు నిప్పుపెట్టుకుంటున్నరు రైతులు, పొలాల్లో గొర్రెలు మేకలను మేపుతున్న రైతులు గవర్నర్ ప్రసంగం నుంచి ఒక్క మాట కోసం ఇవాళ ఎదురుచూశారు. మేం పంటలు ఎండిపోకుండా కాపాడుతాం.. మేం ఉన్నాం.. ఈ ప్రభుత్వం మీకు భరోసా ఇస్తుంది. మేడిగడ్డను రిపేర్ చేస్తాం. ఇన్నిరోజులు కేసీఆర్‌పై కోపంతో తప్పు చేశామని ప్రాయశ్చిత్తం చేసుకుంటరనుకున్నామని.. కానీ, ఆ సోయి ఈ ప్రభుత్వానికి లేదు. కనీసం ఒక మాట మాత్రంగా కూడా ఎండుతున్న పంటలు, సాగునీటి సంక్షోభం.. 480 మంది రైతుల ఆత్మహత్యలపై ఒక్కమాట మాట్లాడకపోవడం అంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యతలు ఎట్ల ఉన్నయో దీన్ని బట్టే తెలుసుకోవచ్చు' అంటూ కేటీఆర్ విమర్శించారు.

## గవర్నర్లు మారారు తప్ప.. ప్రసంగాలు మారలేదు


హైదరాబాద్, అసెంబ్లీలో గతేడాది గవర్నర్ ప్రసంగానికి.. ఈ సారి గవర్నర్ ప్రసంగానికి తేడా ఏం లేదని.. గవర్నర్లు మారడం తప్ప.. ప్రసంగాలు మారలేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. చేయనివి చేసినట్లు, ఇవ్వని ఇచ్చినట్లుగా అబద్ధాలు, అవాస్తవాలతో కూడిన ప్రసంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గవర్నర్‌తో చెప్పించిందన్నారు. గవర్నర్ ప్రసంగంపై మాజీ మంత్రి హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. ఏడాదిన్నర ప్రభుత్వ పాలనా వైఫల్యానికి గవర్నర్ ప్రసంగం నిదర్శనమన్నారు. రేవంతు అబద్దాల ప్రచారాన్ని నమ్మించేందుకు గవర్నర్‌ను వాడుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. గవర్నర్ మహాత్మా గాంధీ చెప్పిన మాటలతో 32 పేజీల ప్రసంగం మొదలు పెట్టారని.. 'నిన్ను నువ్వు కనుగొనడానికి అత్యుత్తమ మార్గం ఇతరుల సేవలో నిమగ్నమవ్వడమే' అని.. నిజానికి రేవంత్ రెడ్డి అత్యుత్తమ మార్గం ఢిల్లీ, చంద్రబాబు సేవలో నిమగ్నం అయ్యాడని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారన్నారు. ట్రాన్స్ ఫార్మింగ్ లైవ్స్ అన్నారని.. ఎవరి లైవ్స్ ట్రాన్స్ ఫార్మ్ చేశారని ప్రశ్నించారు.

ప్రజలు అభివృద్ధి చెందాలి.. కాంగ్రెస్ మంత్రులు కాదు..

లగచర్ల, న్యాల్కల్, అశోక్‌నగర్‌లో రైతులను, నిరుద్యోగులను పోలీసులతో కొట్టించడం, ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం ఇదేనా మీరు చెప్పిన ట్రాన్స్ ఫార్మింగ్ లైవ్స్ అంటూ నిలదీశారు. ఇవాళ ఇద్దరు జర్నలిస్టులను అరెస్టు చేసి ప్రజాపాలన పేరుతో పెద్ద ట్రాన్స్ ఫార్మేషన్ చేశారని ఎద్దేశా చేశారు. ఇంక్లూసివ్ డెవలప్‌మెంట్ అంటే అన్ని వర్గాల ప్రజల డెవలప్‌మెంట్ కావాలని.. అంతే గానీ కాంగ్రెస్ మంత్రులు, నాయకుల డెవలప్‌మెంట్ కాదంటూ చురకలంటించారు. 20శాతం కమీషన్లు తీసుకోవడమేనా? మీరు చెప్పిన ఇంక్లూసివ్ డెవలప్‌మెంట్ అంటూ ధ్వజమెత్తారు. ప్రజల సేవ ఎక్కడిది.. స్వయం సేవా, ఢిల్లీ సేవలో రేవంత్ రెడ్డి, మంత్రి వర్గం తరిస్తుందన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్చారని.. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టే చోట రాహల్ గాంధీ తండ్రి విగ్రహం పెట్టారని ఆరోపించారు. తెలంగాణ సంస్కృతి అభివృద్ధికి చేపట్టిన చర్యలుగా భావించాలా? అని ప్రశ్నించారు. వ్యవసాయం పెంచింది ఎవరు.. గొప్పలు చెబుతున్నది ఎవరు? అని నిలదీశారు.

కోటి ఎకరాల మాగాణంగా మార్చింది కేసీఆర్ కాదా?

34లక్షల ఎకరాల నుంచి కోటి ఎకరాల మాగాణంగా మార్చింది కేసీఆర్ కాదా? కాళేశ్వరం సహా ఇతర ప్రాజెక్టులు, మిషన్ కాకతీయతో అది సాధ్యమైందన్నది వాస్తవమన్నారు. గొప్పగా చెప్పిన 260 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి రికార్డు



కేసీఆర్ పదేళ్ల కృషితో సాధ్యమైందా? ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో సాధ్యమైందా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ అనేది పెద్ద బోగస్ అని, రూ.41వేల కోట్ల రుణమాఫీ అని చెప్పి.. బడ్జెట్‌లో రూ.31వేల కోట్లు చెప్పి, 20వేలకోట్లు అంటూ ప్రచారం చేసుకుంటున్నారన్నారు. రైతు భరోసా రూ.15వేలు ఇస్తమని, సిగ్గులేకుండా రూ.12వేలకు తగ్గించారని.. దాన్ని గొప్పగా గవర్నర్ ప్రసంగంలో చెప్పుకున్నారని విమర్శించారు. రైతు కూలీలకు రూ.12వేలు ఇస్తున్నామని పచ్చి అబద్ధాలు గవర్నర్‌తో చెప్పించారన్నారు. ఇప్పటి వరకు కనీసం రూపాయి అయినా ఎవరి ఖాతాల్లో అయినా పడిందా? అని ప్రశ్నించారు.

రైతు వేదికలు కట్టింది ఎవరు?

అసలు 566 రైతు వేదికలు కట్టింది ఎవరు ? అది కూడా మీ ఘనతేనా? అని నిలదీశారు. కేసీఆర్ చేసింది కూడా కేసీఆర్ ముందే మీ ఘనత గా చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. చేనేతలకు ఉన్న పథకాలన్నీ రద్దు చేసి.. వాళ్లను బలహీనం చేసి.. దెబ్బతీసి.. ఇప్పుడు కొత్త పథకాన్ని ప్రకటించారన్నారు. రుణమాఫీ, రైతు భరోసాలాగానే ఈ పథకం అమలు అంతేనా? అంటూ అనుమానం వ్యక్తం చేశారు. అన్ని పంటలకు బోనస్ అని చెప్పి సన్నాలకు పరిమితం చేశారని, ఇంకా రూ.400కోట్లు పెండింగ్ ఉందని.. రూ.1200 కోట్లు ఇచ్చామనడం పచ్చి అబద్ధమన్నారు. మీరు ఏర్పాటు చేసిన వ్యవసాయ కమిషన్ ఏం చేసిందని.. యాసంగిలో పంటలు వేయకండి అని చెప్పిందని.. అంతకు మించి చేసిన పనేంటి అంటూ నిలదీశారు. 445 రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. కనీసం రైతు బీమా డబ్బులు కూడా ఇవ్వడం లేదన్నారు.

## గవర్నర్ ప్రసంగాన్ని అవహేళన చేస్తున్నారు



హైదరాబాద్,తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ, బీఆర్ఎస్ నేతల తీరును తీవ్రంగా విమర్శించారు.గవర్నర్ ప్రసంగాన్ని అవహేళన చేయడం తగదని, కనీసం గవర్నర్ ప్రసంగాన్ని గౌరవించే సంస్కృతి కూడా బీఆర్ఎస్ నేతలకు లేదని ఆయన అన్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి ముందుగా అసెంబ్లీకి హాజరై సలహాలు, సూచనలు ఇవ్వాలని ప్రభుత్వ విప్ సూచించారు. ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను పట్టించుకోవడం లేదని, వారు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని ఆయన పేర్కొన్నారు. ప్రజలు వారి తీరును గమనిస్తున్నారని, విపక్షంగా వారు సరిగ్గా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారని ఐలయ్య పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ, కులగణన వంటి కీలక నిర్ణయాలతో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అయితే, ఈ కులగణనలో కల్వకుంట్ల కుటుంబ సభ్యులు పాల్గొనకపోవడం దుర్మార్గమన్నారు.కేసీఆర్ ప్రభుత్వం హయాంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, కాళేశ్వరం ప్రాజెక్టు పేరు మీద భారీగా కమిషన్లు దండుకున్నారని బీర్ల ఐలయ్య విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగిస్తుందని, గత 10 ఏళ్ల పాలనలో బీఆర్ఎస్ మిగిల్చిన అప్పులను తగ్గించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్లు రుణమాఫీ చేసినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం 10 ఏళ్లలో లక్ష రూపాయలు కూడా రుణమాఫీ చేయలేదని విమర్శించారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, కొత్త పథకాలను రూపొందిస్తున్నామని తెలిపారు.తెలంగాణ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చినట్లు బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. పింక్ పార్టీ సోషల్ మీడియా తప్పుడు ప్రచారాన్ని ఆపాలని, రేవంత్ రెడ్డి తీసుకుంటున్న అభివృద్ధి చర్యలను అడ్డుకోవడం బీఆర్ఎస్ ఆలోచనగా మారిందని అన్నారు. తెలంగాణ సచివాలయంలో రాష్ట్రం తల్లికి స్మారకంగా తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలని, కానీ కేసీఆర్ విగ్రహాన్ని ప్రతిష్టించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ప్రతి అంశంలో కమిషన్ల కోసం పనిచేసిన బీఆర్ఎస్ ఇప్పుడు అనవసరమైన ఆరోపణలు చేస్తోందని పేర్కొన్నారు.బీఆర్ఎస్ చేసిన అప్పులు, అవినీతి, పాలనలో చేసిన పొరపాట్లను సీఎం రేవంత్ రెడ్డి సరిదిద్దుతున్నారని బీర్ల ఐలయ్య స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ అసలు రూపాన్ని అర్థం చేసుకుని, రాబోయే రోజుల్లో సరికొత్త పాలన కోసం సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

## హిందీ వివాదంపై సుధా మూర్తి కీలక వ్యాఖ్యలు




న్యూఢిల్లీ,ప్రస్తుతం తమిళనాడులో హిందీ వివాదం నడుస్తోంది. కేంద్రం బలవంతంగా తమిళనాడుపై హిందీ రుద్దుతోందని డీఎంకే అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇక పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల రెండో దశ ప్రారంభమైన దగ్గర నుంచి డీఎంకే సభ్యులుఉభయ సభల్లో ఆందోళన కొనసాగిస్తున్నారు.ఇంకోవైపు తమిళనాడులో త్రిభాషా ఉద్యమాన్ని బీజేపీ ప్రారంభించింది. ఇలా హిందీ వివాదం జాతీయ స్థాయిలో ఉద్రిక్తంగా సాగుతోంది.తాజాగా ఇదే అంశంపై ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి భార్య, రాజ్యసభ ఎంపీ సుధా మూర్తి స్పందించారు.

ఒక వ్యక్తి బహుళ భాషలు నేర్చుకుంటే తప్పేంటి? అని ప్రశ్నించారు. ఒక వ్యక్తి అనేక భాషలు నేర్చుకోవచ్చన్నారు. అంతెందుకు తనకు 7-8 భాషలు తెలుసు అని సుధా మూర్తి చెప్పుకొచ్చారు. ఈ మేరకు పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడారు. జాతీయ విద్యా విధానంలో త్రిభాషా విధానం కరెక్టేనని ఆమె చెప్పుకొచ్చారు.ఇక విద్యాశాఖ పనితీరు కూడా మెరుగుపడాలని సూచించారు. ఉపాధ్యాయులు కూడా ఎప్పటికప్పుడు మెరుగుపడుతూ ఉండాలని తెలిపారు. ప్రతి మూడేళ్లకోసారి వారికి కూడా టెస్టులు నిర్వహించి.. వారి యొక్క పరిజ్ఞానాన్ని పరీక్షించాలని చెప్పారు. లేదంటే ఉపాధ్యాయులు మెరుగుపడరని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల పనితీరు బాగుంటేనే స్టూడెంట్ భవిష్యత్ బాగుంటుందని అభిప్రాయపడ్డారు. జీవితంలో తల్లి ప్రేమ తప్ప ఏదీ ఉచిత కాదని.. మంచి ఉపాధ్యాయుడు కావాలంటే వారికి మూడేళ్లకోసారి శిక్షణ ఇచ్చి పరీక్షలు పెట్టాల్సిందేనని సుధామూర్తి చెప్పుకొచ్చారు.

## నిరుద్యోగ భృతి ఊసేలేదు.. తల్లికి వందనంను ఎగ్గొట్టారు!

అమరావతి,కూటమి ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చిందని, ఇంతవరకూ ఆ ఊసే లేదని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. సమున్నత ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం నీరుగారుస్తోందని, బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఈ ఏడాది తల్లికి వందనంను ఎగ్గొట్టారని, వచ్చే ఏడాది నుంచి ఇస్తామని చెబుతున్నారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో విద్యారంగం ఎంతో పటిష్టంగా తయారైందని మాజీ మంత్రి కాకాణి చెప్పుకొచ్చారు. నెల్లూరులో వైసీపీ ఆధ్వర్యంలో 'యువత పోరు' కార్యక్రమం జరిగింది. వీఆర్ కళాశాల సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ కొనసాగింది.'యువత పోరు' కార్యక్రమంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ%% 'సమున్నత ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం నీరుగారుస్తోంది. బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూడా ప్రభుత్వం ప్రైవేటీకరిస్తోంది. నిరుద్యోగులకు భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చారు, ఇంతవరకూ ఆ ఊసే లేదు. ఈ ఏడాది తల్లికి వందనాన్ని ఎగ్గొట్టారు, వచ్చే ఏడాది నుంచి ఇస్తామని చెబుతున్నారు. బడ్జెట్లో రూ.8 వేల కోట్లను మాత్రమే కేటాయించారు. ఈ పథకానికి రూ.16వేల కోట్ల నిధులు అవసరమవుతాయి. విద్యా రంగాన్ని సీఎం చంద్రబాబు దెబ్బ తీస్తున్నారు. వైసీపీ హయాంలో విద్యారంగం ఎంతో పటిష్టంగా తయారైంది.




నాడు-నేడుతో పాఠశాలలకు కొత్త రూపును మాజీ సీఎం వైఎస్ జగన్ తీసుకువచ్చారు' అని అన్నారు.మరోవైపు కర్నూలు కలెక్టరేట్ ముందు వైసీపీ ఆధ్వర్యంలో ఫీజు పోరు ఆందోళన చేపట్టారు. గౌరీ గోపాల్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు చెల్లించాలని.. నిరుద్యోగ భృతి హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఫీజు పోరు కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శ్రీదేవి, సాయి ప్రసాద్ రెడ్డి, కోడుమూరు సమన్వయకర్త ఆదిమూలపు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

గురువారం 13-03-2025

# ఈసీకి జ్ఞానోదయం ఎప్పుడు?

తటస్థతకు తిలోదకాలొదిలి అవకతవకలకు అసలైన చిరునామాగా మారిన ఎన్నికల సంఘం(ఈసీ) సిగ్గుపడాల్సిన విషయమిది. ఆరోపణలొచ్చి నప్పుడూ, ఫిర్యాదులందినప్పుడూ మౌనంతోనో, దబాయింపుతోనో తప్పించుకోజూస్తున్న ఈసీపై సోమవారం పార్లమెంటు ఉభయసభలూ దద్దరిల్లాయి. మహారాష్ట్రలో వోటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ ఆరోపణలు చేసి మూణ్ణెల్లవుతోంది. నెల క్రితం కూడా ఆ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ మీడియా సమావేశంలో ఈసీపై అభియోగాలు మోపారు. అయిదు నెలల వ్యవధిలో కొత్తగా 39 లక్షలమంది వోటర్లు ఎలా పుట్టుకొచ్చారని ప్రశ్నించారు. అవి ఆధార రహితం, తప్పుదోవ పట్టించే అభాండాలని చెప్పటం తప్ప నిర్దిష్టంగా ఫలానా చోట ఏం జరిగిందో, వోటర్ల సంఖ్య పెరగటానికి కారణమేమిటో వివరించే ప్రయత్నం ఈసీవైపు నుంచి లేదు! అటు బెంగాల్‌లో ఈ మాదిరి అవకతవకలే బయటపడి ఆ సంస్థ పరువు బజారుపాలు చేశాయి. వోటర్ల జాబితా అవకతవకలతోపాటు నకిలీ వోటరు కార్డులు రాజ్యమేలుతున్నాయని తృణమూల్ ఫిర్యాదు చేస్తే మూడు నెలల్లో సరిచేస్తామన్న జవాబొచ్చింది. వెనువెంటనే దర్యాప్తు చేసి దీనివెనక జరిగిందేమిటో తేల్చిచెప్పడానికి బదులు సరిచేస్తామనటంలో మర్మమేమిటి? అక్కడే కాదు... హరియాణా, గుజరాత్, ఒడిశా, యూపీల్లో సైతం ఇలాగే జరిగిందని విపక్ష సభ్యులు ఆరో పించారు. ఇటీవల ఎన్నికలు జరిగిన ఢిల్లీలోనూ ఇదే తంతు నడిచిందని ఆప్ ఆరోపణ. రాజ్యాంగ సంస్థగా ఎంతో హుందాగా, నియమ నిబంధనలకు లోబడి పనిచేయాల్సిన సంస్థ ఇలా అడుగడు గునా కంతలతో, లోపాయికారీ వ్యవహారాలతో ఎన్నికలు జరిపించటం సిగ్గుచేటు కాదా?ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ నిష్టగా నిర్వహించాల్సిన క్రతువు. అది కాస్తా ఈమధ్య కాలంలో నవ్వుల పాలవుతున్న వైనం కనబడుతున్నా తనకేం సంబంధం లేనట్టు ఆ సంస్థ ప్రవర్తి స్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో నిరుడు ఎన్నికల సందర్భంగా కేంద్రంలోని అధికార ఎన్డీయే కూటమితో కొత్తగా చుట్టరికం కుదిరిందన్న ఏకైక కారణంతో అప్పటి విపక్ష నాయకులు చెప్పినట్టల్లా అధికారు లను బదిలీలు చేశారు. పర్యవసానంగా ఇతర జిల్లాల్లో జరిగిన దారుణ ఉదంతాల సంగతలా ఉంచి పల్నాడు ప్రాంతం ఎంతటి హింసను చవిచూసిందో, ఎన్ని గ్రామాల ప్రజలు ఇళ్లూ వాకిళ్లూ వదిలి ప్రాణభయంతో పారిపోయారో మీడియా సాక్షిగా వెల్లడైంది. పోలింగ్ కేంద్రాల దురాక్రమణ, తెల్లారుజాము వరకూ పోలింగ్ తంతు కానివ్వటం వంటి అరాచకాలకు అంతులేదు. సాయంత్రం గడువు ముగిసే సమయానికి పోలింగ్ కేంద్రం గేట్లు మూసి ఆ ఆవరణలో ఉన్నవారికి మాత్రమే స్లిప్‌లిచ్చి వోటు వేయటానికి అనుమతించాలని నిబంధనలు చెబుతున్నాయి. క్యూలో చిట్టచివర గేటు దగ్గర ఉన్నవారికి ఒకటో నంబర్ స్లిప్ ఇవ్వటంతో మొదలెట్టి బూత్ సమీపంలో ఉన్నవారికి ఆఖరి స్లిప్ ఇవ్వాలి. ఓటేశాక ఆ స్లిప్‌లు భద్రపరచాలి. సీసీటీవీ ఫుటేజ్‌లు భద్ర పరచాలి. ఇదంతా జరిగిందా? పోలింగ్ ముగిసిన నాలుగురోజుల తర్వాత 12.5 శాతం వోటింగ్ పెరిగినట్టు చూపటానికి ఈసీ ఏమాత్రం మొహమాట పడలేదు. ఇదంతా ఎక్కడ బయటపడుతుందోనన్న కంగా రుతో పరాజితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించే సమయానికే ఈవీఎంల డేటా ఖాళీ చేశారు. వీవీప్యాట్ స్లిప్‌లు ధ్వంసం చేశారు. ఈవీఎంలలో రికార్డయిన ఓట్ల లెక్కలు బయటకు తీసి, అవి వీవీప్యాట్ స్లిప్‌లతో సరిపోల్చాలని కోరితే డమ్మీ గుర్తులతో కొత్తగా నమూనా వోటింగ్ నిర్వహించ టానికి సిద్ధపడ్డారు! ఇక భద్రపరిచిన ఈవీఎంలలో చార్జింగ్ ఎలా పెరుగుతుందో ఇంతవరకూ చెప్పలేకపోయింది. వీటిపై వైఎస్సార్ కాంగ్రెస్ నిలదీస్తే జవాబివ్వటానికి ఈసీకి నోరు పెగలదు. పార్లమెంటులో ఇంత దుమారం రేగాక డూప్లికేట్ కార్డులపైనా, వోటర్ల జాబితా అవకతవకలపైనా సాధికారికంగా, పద్ధతిగా జవాబివ్వడానికి బదులు వేరే మార్గం ఎంచుకుంది. 'ఈసీ వర్గాలు' అనే పేరుతో ఒక వివరణ బయటికొదిలింది. ఆ సంస్థ తనను తాను ఏమనుకుంటున్నదో గానీ ఇలా మీడియాకు లీకులివ్వటం మర్యాదైన సంగతి కాదు. ఒక పార్టీయో లేదా ప్రభుత్వమో తమ ఆలోచనలపై ప్రజాస్పందనేమిటో తెలుసుకోవటానికి లీకులిస్తుంటాయి. దాని ప్రయోజనం దానికుంటుంది. కానీ ఈసీ అలా చేయటంలో ఆంతర్యమేమిటి? ఉదాహరణకు డూప్లికేట్ వోటర్ కార్డులు వారసత్వపు సమస్యగా తేల్చిచెప్పింది. 2008%-%13 మధ్యే ఈ కార్డులు జారీ అయ్యాయన్నది. అదే నిజమనుకుంటే ఆ సంగతి ఈసీకి ఎప్పుడు తెలిసింది? తెలిశాక తీసుకున్న చర్యలేమిటి? ఇన్నాళ్లూ సరిచేయకపోవటానికి కారణాలేమిటి? అధికారికంగా ఇలాంటి తెలివితక్కువ జవాబు లిస్తే మరిన్ని ప్రశ్నలు వచ్చిపడతాయన్న భయంతోనే ఆ సంస్థ లీకులతో సరిపెట్టింది.ఎంతకాలం ఈ దాగుడుమూతలు? ఎన్నాళ్లు ఈ అవకతవకలు? ఎన్నికల ప్రక్రియపైనా, వివిధ దశల్లో చోటుచేసుకున్న అక్రమాలపైనా ఫిర్యాదులొస్తే నిమ్మకు నీరెత్తినట్టు కూర్చుని ఇప్పుడు పార్లమెంటులో పెద్ద రాద్ధాంతం జరిగాక లీకులివ్వటం, అవి మరిన్ని సందేహాలకు తావీయటం అప్రదిష్ట కాదా? ఇందువల్ల తమ విశ్వసనీయత దెబ్బతింటుందన్న ఇంగితజ్ఞానం కూడా లేదా? ఓడిన రాజకీయ పార్టీలు మాత్రమే కాదు... సాక్షాత్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా పనిచేసిన ఎస్‌వై ఖురేషీ సైతం గతంలోనూ, ఇప్పుడూ కూడా అనేక ప్రశ్నలు లేవనెత్తారు. ఎన్నికల సంఘం తీరు సవ్యంగా లేదన్న అభిప్రాయం ప్రజల్లో బలపడుతున్నదని హెచ్చరించారు. కనుక ఆ సంస్థ ఇప్పటికైనా పారదర్శకతతో వ్యవహరించటం నేర్చుకోవాలి. తప్పును తప్పుగా ఒప్పుకొనే నిజాయితీ ప్రదర్శించాలి. లేనట్టయితే ప్రజానీకం దృష్టిలో దోషిగా మిగలక తప్పదు.

# చట్టసభలను చులకన చేయడం తగదు !



హైదరాబాద్,చట్టసభలకు ఎన్నికైన వారు..సభకు, ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా నడుచుకోవాలి. సభలో ప్రజల పక్షాన నిలబడాలి. హోదాతో సంబంధం లేకుండా నడుచుకునేలా చూసుకోవాలి. అయితే తెలుగు రాష్ట్రాల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది. ప్రతిపక్షహోదా కలిగిన బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ చట్టసభలకు రావడం లేదు. సభలో ప్రజాసమస్యలపై చర్చించడం లేదు. ప్రతిపక్ష హోదా ఉన్నా కూడా యాన సభకు రాకుండా మొహం చాటేస్తున్నారు. పదేళ్లపాటు సిఎంగా పని చేసిన కెసిఆర్ విపక్షానికి పరిమితం కావడంతో ఇక ప్రజలతో పనేం అన్న విధంగా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రభుత్వం బాగా పనిచేయడం లేదని, ఇక అంతు తేలుస్తానని బయటనుంచి మాట్లాడుతున్నారు. కానీ సభకు వచ్చి సమసయలను ప్రస్తావించడం, తన ప్రభుత్వ హయాంలో జరిగిన మంచిచెడులను చర్చించడం జరగడం లేదు. ఇది ఓ రకంగా ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదు. అలాంటప్పుడు జీతభత్యాలు తీసుకోరాదు. నిజానికి ప్రజాప్రతినిధులకు జీతభత్యాలు, పెన్షన్లపై చర్చించాలి. వారికి కోట్లాది రూపాయలు చెల్లించాల్సిన అవసరమేముందో తేల్చాలి. ప్రజలు పన్నుల రూపంలో కట్టిన డబ్బుతో వారు సుఖాలు అనుభవిస్తున్నారు. ఇకపోతే ఎ.పి అసెంబ్లీలో జగన్ మోహన్ రెడ్డికి ప్రతిపక్ష నేత హోదా ఇచ్చే అంశం మీద ఆసక్తికర చర్చ జరుగుతున్న విషయం తెలిసిందే. ప్రతిపక్షహోదా ఇస్తే తప్ప సభకు రానని మూర్ఖంగా వాదించడం జగన్‌కే చెల్లింది. 11 సీట్లతో ప్రతిపక్ష హోదా రావాలంటే రాదు. దానికి సభా సంప్రదాయాలు, నియమాలు ఉన్నాయి. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా, గతంలో ఎంపిగా పనిచేసిన జగన్ చట్టాల గురించి తెలుసుకోకుండా సభకు రానని చెప్పడం ఎన్నుకున్న ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదు. ప్రతిపక్షహోదా ఉన్న కెసిఆర్ రావడం లేదు..విపక్ష హోదా లేదు కనుక రాను పో అని జగన్ అంటున్నారు. ఇలాంటి నేతలను నమ్ముకుంటే ప్రజలు నట్టేట మునగడం ఖాయం. జగన్‌కి ప్రతిపక్ష హోదా ఇవ్వాలా వద్దా అనేది రాజకీయ నిర్ణయం కాదు. ఈ విషయంలో పార్లమెంటరీ సంప్రదాయాలు ఏం చెబుతున్నాయో పరిశీలించాలి. పార్లమెంటులో లేదా, అసెంబ్లీలో రాజకీయ పార్టీగా గుర్తింపు పొందాలంటే కొన్ని నిబంధనలు పాటించాలి. రాజకీయ పార్టీగా గుర్తింపు పొందితే, ఆ పార్టీ పార్లమెంటు లేదా అసెంబ్లీ ప్రాంగణంలో కొన్ని వసతులు పొందడానికి వీలుంటుంది. ఇటువంటి గుర్తింపు సభాపతి నుంచి వస్తుంది. ఎన్నికల సంఘం దగ్గర రాజకీయ పార్టీగా నమోదు చేసుకొని ఎన్నికల్లో పోటీ చేస్తాయి రాజకీయ పార్టీలు. అటువంటి పార్టీలకు చట్టసభలో ఒక సీట్ వున్నా అవి పార్లమెంటులో రాజకీయ పార్టీలుగానే కొనసాగుతాయిగానీ సభాధ్యక్షుడి గుర్తింపు వుండదు. సభాధ్యక్షుడి గుర్తింపు పొందితేనే సభా ప్రాంగణంలో కార్యాలయానికి గది కేటాయింపు వంటి వసతుల కల్పనకు అవకాశం ఉంటుంది. స్పీకర్ ఆధ్వర్యంలో పనిచేసే బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశాలకు పిలుపు వస్తుంది. వసతుల కల్పనకు నిబంధనలు వేరుగా ఉంటాయి. దీనికి సంబంధించి పార్లమెంటులో మూడు నిబంధనలు పొందుపరిచారు. వాటినే అసెంబ్లీల్లో పాటిస్తున్నారు. కనీసం పదిశాతం సీట్లు పొందిన వారికే విపక్షపార్టీగా గుర్తింపు దక్కుతుంది. గత పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీకి విపక్షహోదా దక్కలేదు. అది కావాలని ఆ పార్టీ పట్టుబట్టలేదు. ఫలితంగా పది సంవత్సరాలు లోక్‌సభలో ప్రతిపక్ష నేత అన్న వ్యవస్థ లేకుండా గడిచింది. 2014లోనూ, 2019 లోనూ కాంగ్రెస్ పార్టీ అతి పెద్ద ప్రతిపక్ష పార్టీగా ఉన్నప్పటికీ దానికి పదో వంతు సంఖ్యా బలం లేదు. పదో వంతు సంఖ్యా బలం లేనప్పుడు ప్రతిపక్ష గ్రూప్‌గా గుర్తిస్తారుగాని ప్రతిపక్ష పార్టీగా గుర్తించక పోవటం గతంలో కూడా జరిగింది. 1984లో ఇందిరా గాంధీ హత్యానంతరం జరిగిన ఎన్నికల్లో లోక్‌సభలో అతి పెద్ద ప్రతిపక్షంగా ఏ జాతీయ పార్టీ నిలువలేదు. ప్రాతీయ పార్టీ అయిన తెలుగు దేశానికి ప్రతిపక్ష గ్రూప్ అన్న గుర్తింపు దక్కింది. అయితే చట్టంలో ప్రతిపక్ష నేతగా గుర్తింపు పొందాలంటే పదో వంతు సభ్యులుండాలన్న నిబంధన అన్నది సంప్రదాయంగా వస్తున్న నిబంధన మాత్రమే. 1977లో మొదటిసారి ప్రతిపక్ష నాయకుడు అనే వ్యవస్థ ఏర్పడింది చట్టం ద్వారా. అయితే 1977లో అప్పటి జనతా ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టం ప్రతిపక్ష నాయకుడిగా గుర్తింపునకు కనీస సభ్యుల సంఖ్యను సూచించలేదు. సభలో అధికారపార్టీని వ్యతిరేకించే పార్టీలలో ఎక్కువమంది సభ్యులుండే పార్టీనేతను ప్రతిపక్ష నేతగా సభాధ్యక్షులు గుర్తిస్తారని పేర్కొన్నది. సభలో అధికార పక్షాన్ని వ్యతిరేకించే ప్రతిపక్ష పార్టీలు సమాన సంఖ్యా బలం కలిగి వుంటే ఏ పార్టీ నేతను ప్రతిపక్ష నాయకుడుగా గుర్తించాలనేది ఆ యా పార్టీల స్థితిగతుల ఆధారంగా సభాధ్యక్షుడు నిర్ణయిస్తారు. ఆ విధంగా సభాధ్యక్షుడి గుర్తింపు పొందిన ప్రతిపక్ష నేతకు కొన్ని సదుపాయాలు కల్పిస్తారు. సభ లోపల వెలుపలా కూడా. జీత భత్యాలు, వాహనం, సహాయ సిబ్బంది, అధికారిక నివాసం మొదలైనవి వస్తాయి.. ప్రతిపక్ష నేతకు కాబినెట్ మంత్రి హోదా కల్పించటం ఒక సంప్రదాయంగా వస్తున్నది. అయితే ఇక్కడ ముఖ్యమైన అంశం ఏమిటంటే ఒక పార్టీకి చట్టసభలో గుర్తింపు పొందటానికి అవసరమైన సభ్యులే లేకపోతే, అలాంటి పార్టీ నాయకుడికి ప్రతిపక్ష హోదా ఇచ్చే ప్రసక్తే లేదనేది 2014లో నాటి లోక్‌సభ స్పీకర్ తేల్చేశారు. ఇది రాజకీయపరమైన నిర్ణయం. ఈ వాదన 2014లో తెర మీదకు వచ్చింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పదో వంతు సభ్యులు కూడా లేరు. కాంగ్రెస్ పార్టీ దానిమీద ఏమీ రాద్ధాంతం చెయ్యలేదు. సభా కార్యకలాపాలకు దూరంగానూ లేదు. ప్రతిపక్ష నాయకుడిని సంప్రదించవలసిన ప్రతి సందర్భంలోను అప్పుడు కాంగ్రెస్ పార్టీ లోక్‌సభాపక్ష నేత అధీర్ రంజన్ చౌదరిని ప్రభుత్వం సంప్రదించింది. రాజ్యాంగ బద్ధమైన పదవులకు నియామకాలు చేసే కమిటీలో ప్రతిపక్ష నేత కూడా సభ్యుడు. ఉదాహరణకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి నియామకం. అటువంటి నియామకాలప్పుడు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వకున్నా నరేంద్ర మోడీ ప్రభుత్వం అధీర్ రంజన్ చౌదరిని సంప్రదించింది. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే ప్రతిపక్షనేత హోదా కావాలని జగన్ పట్టుబట్టడం అసమంజసం. తనకు దక్కదని తెలిసి కూడా ఆ హోదా కోసం ఆరాటపడటం హుందాతనం అనిపించు కోదు. సభలో మాట్లాడటానికి కేటాయించే సమయం రాజకీయ పక్ష సభ్యుల సంఖ్యాబలం మీద ఆధారపడి ఉంటుంది. మాట్లాడే హక్కు ప్రతి సభ్యుడికీ ఉంటుంది. ఎంతసేపు అనేది సభాపతి నిర్ణయం. ప్రతిపక్షనేత గనుక కచ్చితంగా ఇంత సమయం కేటాయించాలి అన్న నిబంధన ఏమీ లేదు. తనకు 40 శాతం ఓట్లు వేసిన ప్రజల పక్షాన పోరాడాల్సిన సమయంలో హోదా ఇవ్వలేదనే వంకతో అసెంబ్లీకి రాకపోవటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఇది కెసిఆర్, జగన్ ఇద్దరికీ వర్తిస్తుంది. సభకు ఎన్నికయ్యాక సమావేశాలకు హాజరు కావాల్సిందే. ప్రజల పక్షాన నిలబడాల్సిందే. అంతే తప్ప తమ మూర్ఖ వాదనలతో ప్రజలను చులకన చేయడం సరికాదు.

# జగన్ అమరావతిని నిర్లక్ష్యం చేశారు



అమరావతి, ఏపీ రాజధాని అమరావతి నిర్మాణంపై పురపాలకశాఖ మంత్రి నారాయణ కీలక ప్రకటన చేశారు. రాజధాని అమరావతి నిర్మాణానికి 64,721 కోట్లు ఖర్చవుతుందని.. వచ్చే మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. అమరావతి నిర్మాణానికి 30 వేల ఎకరాలు కావాలని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన మాజీ సీఎం జగన్.. ఆ తర్వాత ప్లేట్ ఫిరాయించారని ఎద్దేవా చేశారు. రాజధాని నిర్మాణం కోసం బహుళ పక్ష ఏజెన్సీలు, భూములు అమ్మడం, లీజుల ద్వారా నిధులు సేకరిస్తామని చెప్పారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల్లో బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానమిచ్చారు. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్(ఏజీసీ)లో ఇళ్లు, భవన నిర్మాణాలు, ట్రంక్ ఇన్ ఫ్రాస్టక్చర్,ఎల్పీఎస్ మౌళిక సదుపాయాల అభివృద్ధి కోసం 64,721.48 కోట్లు ఖర్చవుతుందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈ నిధులను వివిధ రూపాల్లో సేకరించి అమరావతి నిర్మాణం చేపడుతున్నామని.. బహుళ పక్ష ఏజెన్సీలు, బ్యాంకుల నుండి లోన్?లు, కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంటులను పొందడం ద్వారా నిధుల సేకరిస్తున్నామని తెలిపారు. రైతులకు అభివృద్ధి చేసిన ఎలాట్లను దశల వారీగా మూడేళ్లలో అప్పగించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.2019-24 మధ్య విధానపరమైన అనిశ్చితుల కారణంగా ఈ ప్రక్రియలో జాప్యం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మీద నమ్మకంతో 58 రోజుల్లోనే 34 వేల ఎకరాలు భూమిని రైతులు ప్రభుత్వానికి ఇచ్చారని.. ప్రపంచంలోనే టాప్ 5 రాజధానిగా అమరావతి ఉండాలని సీఎం ఈ ప్రాజెక్ట్ డిజైన్ చేశారని పేర్కొన్నారు. రాజధాని నిర్మాణానికి అయ్యే ఖర్చులో ప్రపంచ బ్యాంకు, ఏడీబీ కలిసి 13,400 కోట్లు రుణం ఇస్తున్నాయని వివరణ ఇచ్చారు.కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు 5 వేల కోట్లు లోన్ ఇస్తుంది. హడ్కో నుంచి రూ.11000 కోట్లు రుణం రెండు మూడు రోజుల్లో వస్తుంది. కేంద్రం గ్రాంట్ కింద మరో రూ.1560 కోట్లు ఇస్తుంది. అమరావతి లోపల భూములు అమ్మడం, లీజు ద్వారా అలాగే జాతీయ, అంతర్జాతీయ మార్కెట్?లో తక్కువ వడ్డీకి లోన్ తీసుకోవడం ద్వారా మిగిలిన నిధులు సమీకరిస్తామని మంత్రి నారాయణ అసెంబ్లీలో వెల్లడించారు. అమరావతిలో 106 ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగ సంస్థలు తమ కార్యాలయాలు ఏర్పాటుచేసేందుకు సిద్దంగా ఉన్నాయని చెప్పారు. టెండర్ల ప్రక్రియ పూర్తయి పనులు ప్రారంభించేందుకు లెటర్ ఆఫ్ అగ్రిమెంట్లు ఇచ్చేందుకు అథారిటీ అనుమతి తీసుకుంటున్నట్లు మంత్రి నారాయణ చెప్పారు. అమరావతిలో ట్రంక్ రోడ్లు(మెయిన్ రోడ్లు) 165 అడుగులు,185 అడుగులతో రెండేళ్లలో పూర్తి చేస్తాం.. ఎల్పీఎస్ రోడ్లు మూడేళ్లలో పూర్తి చేస్తామని తెలిపారు. సగానికి పైగా నిర్మాణం జరిగిన అధికారుల భవనాలు ఏడాదిన్నరలో.. మిగతావి రెండేళ్లు, అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు నిర్మాణాలను మూడేళ్లలో పూర్తి చేస్తామని మంత్రి నారాయణ చెప్పారు. అమరావతి నిర్మాణానికి 30 వేల ఎకరాలు కావాలని జగన్ ఇదే అసెంబ్లీ సాక్షిగా చెప్పారు. కానీ ప్రభుత్వం మారగానే ప్లేటు ఫిరాయించి మూడు ముక్కలాట ఆడి ఎక్కడా రాజధాని ఏర్పాటు చేయలేదు మండిపడ్డారు. గత ఐదేళ్లలో రాజధానికి భూములిచ్చిన రైతులను నానా ఇబ్బందులు పెట్టారు. శాడిజంతో కక్ష సాధింపుతో ఆర్ -5 జోన్ చేసి 50 వేల మందికి ఒక సెంట్ భూమి ఇచ్చారని మండిపడ్డారు. వారికి కూడా ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తున్నాం.. వేరొక చోట స్థలం కేటాయించి అమరావతి భూములను రాజధాని కోసం తీసుకుంటామని స్పష్టం చేశారు. గత అయిదేళ్ల పరిణామాల వల్ల కొందరు వెనెక్కి వెళ్లారని తెలిపారు. 31 ఆర్గనైజేషన్‌లకు 629.3 ఎకరాలకు అంగీకారం తెలిపామన్నారు. 13 సంస్థలకు ఇచ్చిన భూములు రద్దు చేశామన్నారు. 1280 ఎల్‌పీఎస్ రోడ్లకు టెండర్లు పిలిచామన్నారు. కొండవీటి వాగు, వాగు గ్రావీటీ కెనాల్‌లకు టెండర్లు పిలిచామన్నారు. మొత్తం 73 వర్కులకు రూ.64,721 కోట్లు ఎస్టిమేషన్ వేశామని... వీటిలో 62 పనులను టెండర్లు అయిపోయాయని చెప్పారు. గత ముఖ్యమంత్రి 50 వేల మందికి సెంటు లెక్కన ఇచ్చారన్నారు. వారికి ప్రత్యామ్నాయ స్థలం ఇచ్చి ఆ భూమిని కూడా తీసుకుంటామని మంత్రి నారాయణ సభలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం అరాచక పాలనలో అమరావతి నిర్వీర్యం ఒక భాగమని సుజనాచౌదరి అన్నారు. భారత రాజ్యాంగాన్ని గత ప్రభుత్వం తుంగలోతొక్కిందని ఫైర్ అయ్యారు. ఇదే అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్యాపిటల్‌ను సెలెక్ట్ చేశారని.. రీ ఆర్గనైజేషన్ యాక్ట్‌లో తెలంగాణకు హైదరాబాద్‌ను.. ఏపీకి ఎలె÷-టకెడ్ గవర్నమెంట్ క్యాపిటల్‌ను నిర్ణయించుకోవచ్చని చెప్పారన్నారు. క్యాపిటల్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశామన్నారు. ఈ క్యాపిటల్ విషయంలో జగన్ చేసిన అరాచకానికి ఎవరు బాధ్యులో కూడా తేల్చాలన్నారు. అసలు క్యాపిటల్ విషయంలో చట్టాన్ని మార్చాలంటే లీగల్, ÷నాన్స్ క్లియరెన్స్ ఎవరు ఇచ్చారని... క్యాబినెట్‌కు ఎవరు పెట్టారని అడిగారు. కోట్లాది రూపాయలు లాయర్లకు ఈ విషయంలో ఎవరు ఖర్చుపెట్టారని ప్రశ్నించారు. అమరావతి విషయంలో కాస్తా ఎమోషన్ అయ్యి న్యాయవాదులతో ఇక్కడ అన్యాయం జరుగుతోంది అని చెప్పానని.. మూడు పంటలు వచ్చే భూమిని సీఎం చంద్రబాబుపై ఉన్న నమ్మకంతో రైతులు ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా అమరావతి రైతులు పోరాడేటప్పుడు ఒక అంగుళం కూడా కదిలించలేరని చెప్పానని తెలిపారు. నాకు 600 ఎకరాలు ఉన్నాయని నోటీసు ఇచ్చారు. అయితే నాకు, నా కుటుంబానికి ఇక్కడ అంగుళం కూడా లేదు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయానికి కారణం ఎవ్వరో తేల్చాలి' అని కోరారు. సీఆర్డీఏ చట్టంలో చేయాల్సిన పనులు చేశారా లేదా ... రాజ్యాంగాన్ని వయలేట్ చేశారన్నారు.

# హైదరాబాద్‌లో రోడ్డెక్కిన ట్రిపుల్ ఆర్ బాధిత రైతులు

హైదరాబాద్: ట్రిపుల్ ఆర్‌లో భూములు కల్పోతున్న బాధితులు హైదరాబాద్‌లో రోడ్డెక్కారు. తమను రోడ్డున పడేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఆర్‌ఆర్‌ఆర్ బాధితులు ఆందోళనకు దిగారు. భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలంటూ బంజారాహిల్స్ రోడ్ నెం 2లోని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రిజినల్ ఆఫీస్ ముందు ధర్నాకు దిగారు. చౌటుప్పల్, భువనగిరి, గజ్వేల్ ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్‌ఆర్‌ఆర్ బాధిత రైతులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్ విలువ రూ.5 కోట్లకు పైగా ఉంటే ప్రభుత్వం రూ.20 లక్షలు మాత్రమే చెల్లిస్తోందని...తమ భూములకు మార్కెట్ ధరల ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడేళ్ళ నుంచి న్యాయం చేయాలని అన్ని ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా ఎవరు పట్టించు కోవడం లేదని ఆర్‌ఆర్‌ఆర్ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు . మున్సిపాలిటీల మధ్యలో నుంచి కాకుండా ట్రిపుల్ ఆర్ అలైన్ మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. వరంగల్ హైవే కోసం, కాళేశ్వరం కాలువల నిర్మాణానికి, ఎలక్ట్రిసిటీ హైటెన్షన్ టవర్స్ కోసం, యాదగిరి గుట్ట రోడ్డు అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటికే తమ భూములు తీసుకుందన్నారు. అభివృద్ధి పేరుతో మళ్లీ తమ భూములను లాక్కుంటే వ్యవసాయం ఎలా చేసుకోవాలని..ఎలా బతకాలని ప్రశ్నించారు. భూముల కోల్పోతున్న బాధిత రైతులకు ప్రత్యామ్నాయం చూపి..సరైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో ట్రిపుల్ ఆర్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ముందుగా ప్రభుత్వం ట్రిపుల్ నార్త్ పూర్తి చేసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే దీనికి సంబంధించిన భూసేకరణ పూర్తయింది. 161.518 కిలోమీటర్ల( ట్రిపుల్ ఆర్ నార్త్) రోడ్డును రూ.7104.06 కోట్లతో నిర్మిస్తున్నారు. 1వ ప్యాకేజీ: గిర్మాపూర్ నుంచి రెడ్డిపల్లి వరకు 34.518 కిలోమీటర్ల నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని రూ. 1529.19 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్లు మెయింటెనెన్స్ చేయాలి. 2వ ప్యాకేజీ: రెడ్డిపల్లి నుంచి ఇస్లాంపూర్ వరకు 26 కిలోమీటర్ల 4 వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని రూ.1114.80 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్ల మెయింటెనెన్స్ చేయాలి. 3వ ప్యాకేజీ: ఇస్లాంపూర్ నుంచి ప్రజ్ఞాపూర్ వరకు 23 కిలోమీటర్ల నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని రూ.1184.81 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్లు నిర్వహించాలి. 4వ ప్యాకేజీ: ప్రజ్ఞాపూర్ నుంచి రాయగిరి వరకు 43 కిలోమీటర్లు నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని 1728.22 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్ల మెయింటెనెన్స్ చేయాలి. 5వ ప్యాకేజీ: రాయగిరి నుంచి తంగడ్ పల్లి వరకు 35 కిలోమీటర్ల నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని రూ.1547.04 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్లు నిర్వహించాలి ఈ క్రమంలో ఇప్పటికిప భూసేకరణ మొదలయ్యింది. తమకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని రైతులు హెచ్చరించారు.

# మెట్లు ఎక్కగానే ఇక అయ్యప్ప దర్శనం

తిరువనంతపురం,శబరిమల అయ్యప్ప ఆలయంలోని సన్నిధానంలో 18 పవిత్ర మెట్లను అధిరోహించిన వెంటనే భక్తులు నేరుగా స్వామి దర్శనం అయ్యేలా మార్పులు చేయాలని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) నిర్ణయించింది. ఈ మార్పును ఈ నెల 15 నుంచి 12 రోజుల పాటు విష్ణు పూజ జరిగే రోజుల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని టీడీబీ అధ్యక్షుడు పి.ఎస్.ప్రశాంత్ వెల్లడించారు. ఇది విజయవంతమైతే తదుపరి మండల మకరవిళక్కు సీజన్‌లోనూ దీన్ని కొనసాగిస్తామని తెలిపారు. మెట్లను ఎక్కిన వెంటనే ప్రస్తుతం భక్తులను ఒక వంతెన మీదికి మళ్లిస్తున్నామని అక్కడ వారు కొంత సమయం క్యూలో వేచి ఉండి అనంతరం స్వామి దర్శనం కోసం మరోవైపునకు వెళ్తున్నారని ప్రశాంత్ చెప్పారు. ఈ పద్ధతిలో భక్తులకు కేవలం ఐదు సెకన్ల వరకే దర్శనభాగ్యం దక్కుతోందన్నారు. భక్తులు మెట్లు ఎక్కిన వెంటనే దర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కొత్త మార్పు కారణంగా ప్రతి భక్తునికి 20 నుంచి 25 సెకన్ల పాటు దర్శనం చేసుకునే వీలు కలుగుతుందన్నారు. అలాగే మెట్లు ఎక్కగానే స్వామి దర్శనం జరిగిందన్న అనుభూతి కూడా ఉంటుందని భావిస్తున్నారు. మెట్లు ఎక్కగానే దర్శనం కలగాలని మాలధారులు కూఆ కోరుకుంటున్నారు.

# రగిలిపోతున్న శ్రేణులు

అమరావతి,ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీకి అవకాశం లభిస్తుందని భావించిన ఇద్దరు తెలుగుదేశం నేతలకు తీవ్ర నిరాశ మిగిలింది. వారిలో ఒకరు పిఠాపురం వర్మ కాగా మరొకరు పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమ. వీరిరువురూ కూడా ఎమ్మెల్సీ స్థానాన్ని ఆశించారు. ఆశించారనడం కంటే పార్టీ అధిష్ఠానమే వారికి ఎమ్మెల్సీ హామీ ఇచ్చింది. అయితే కారణాలేమైనా తెలుగుదేశం అధిష్ఠానం వీరిద్దరినీ పక్కన పెట్టింది. ఐదు స్థానాలకు ఎన్నికలు జరగనుండగా, వాటిలో ఒక స్థానాన్ని జనసేనకు కేటాయించడం పట్ల తెలుగుదేశంలో ఎవరి నుంచీ ఎటువంటి అభ్యంతరం వ్యక్తం కాలేదు. కానీ బీజేపీకి ఒక స్థానం కేటాయించడం పట్ల క్యాడర్ లోనే కాకుండా.. పార్టీ నేతలలో కూడా అభ్యంతరం, అసహనం వ్యక్తం చేస్తున్నది.బీజేపీ కోసం ప్రతి సారీ తెలుగుదేశం పార్టీయే ఎందుకు త్యాగాలు చేయాలన్న ప్రశ్న కూడా గట్టిగా వినవస్తున్నది. గతంలో ఆర్ కృష్ణయ్య విషయంలోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు ఎమ్మెల్సీ విషయంలోనూ బీజేపీ పట్టుబట్టి ఒక స్థానాన్ని తెలుగుదేశం నుంచి లాగేసుకుందన్న అభిప్రాయం తెలుగుదేశం శ్రేణుల్లో వ్యక్తం అవుతోంది. అదే విధంగా ఇటీవల విజయసాయిరెడ్డి తన రాజ్యసభ స్థానానికి రాజీనామా చేయడంతో ఏర్పడిన ఖాళీని కూడా బీజేపీ అభ్యర్థితోనే భర్తీ చేయాలని ఆ పార్టీ పట్టుబడుతున్నట్లుగా తెలుగుదేశం వర్గాలలో వినిపిస్తోంది. అది పక్కన పెడితే..ప్రస్తుతం ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని తెలుగుదేశం బీజేపీ కోసం త్యాగం చేయడం వల్ల పార్టీ ప్రతిపక్షంలో ఉండగా త్యాగాలు చేసి, పోరాటాలు చేసిన నేతలకు అవకాశం దక్కకుండా పోతున్నది. వారిలో ప్రధానంగా పిఠాపురం వర్మ, దేవినేని ఉమ ఉన్నారు. గత ఎన్నికలలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ కోసం తన సీటును త్యాగం చేసిన పిఠాపురం వర్మకు పార్టీ అధినేత ఎమ్మెల్సీ టికెట్ హామీ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదే విధంగా పోత్తు ధర్మంతో సీటు త్యాగం చేసిన దేవినేని ఉమకూ దాదాపు ఇలాంటి హామీయే దక్కింది. అయితే ఇప్పుడు ఆ ఇద్దరికీ కూడా తెలుగుదేశం ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీకి అవకాశం ఇవ్వలేదు. దీంతో పిఠాపురం వర్మ ఓపెన్ అయిపోయారంటున్నారు. తన సన్నిహితుల వద్ద పార్టీ కోసం త్యాగాలు చేసి తప్పు చేశానని, త్యాగం చేసిన తనకు తగిన శాస్తే జరిగిందనీ వ్యాఖ్యానించినట్లు చెబుతున్నారు. అయితే తరువాత మీడియా సమావేశంలో పార్టీ నిర్ణయమే శిరోధ్యర్యం అని ప్రకటించారనుకోండి అది వేరే సంగతి. ఇక దేవినేని ఉమ బహిరంగంగా తన అసంతృప్తిని వ్యక్తం చేయనప్పటికీ, తనకు ఎమ్మెల్సీ అవకాశం దక్కకపోవడం పట్ల ఆయన నిరాశకు గురైనట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి బీజేపీలో ఎమ్మెల్సీ స్థానానికి తగిన నేత లేరనే చెప్పాలి. జగన్ అధికారంలో ఉన్నన్నాళ్లూ ఆ పార్టీతో అంటకాగిన సోము వీర్రాజుకు ఇప్పుడు బీజేపీ ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వడం తెలుగుదేశం శ్రేణులలో అసంతృప్తినీ, ఆగ్రహాన్నీ కలిగిస్తున్నది.

# పసుపు రైతుల ఆందోళన కనిపించడం లేదా

నిజామాబాద్,నిజామాబాద్ పసుపు రైతుల ఆందోళనలు రాష్ట్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. పసుపు రైతుల ఆందోళనపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. గిట్టుబాటు ధర రాక పసుపు రైతులు అల్లాడుతుంటే రేవంత్ ప్రభుత్వం ఏం చేస్తోందని నిలదీశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. మాటలు చెప్పిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడానికి ఎందుకు ముందుకు రావడం లేదని కవిత ప్రశ్నించారు. క్వింటా పసుపు పంటకు రూ. 15 వేల ధర కల్పిస్తామని ఎన్నికల సమయంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు పసుపు పంటకు కనీసం రూ. 9 వేలు రాని పరిస్థితి ఉందన్నారు. అయినా కూడా రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడానికి చర్యలు తీసుకోకపోవడం దారుణమని ధ్వజమెత్తారు. ఇది రైతులను నయవంచన చేయడమే, మోసం చేయడమేనని కవిత విమర్శించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రూ. 15 వేల మద్దతు ధర చెల్లిస్తూ పసుపు పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డు తీసుకువచ్చామని చెబుతున్న బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ కనీసం రైతులను పరామర్శించడం లేదని మండిపడ్డారు. పసుపు బోర్డుకు చట్టబద్ధత లేకపోవడంతో రైతులకు ప్రయోజనాలు కలగడం లేదని అన్నారు. పసుపు పంటకు ధరలు పెంచుతామని, మరిన్ని ప్రయోజనాలు కల్పిస్తామని పసుపు బోర్డు ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి బండి సంజయ్ చెప్పారని .. కానీ ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ముందుకు వచ్చి పసుపు రైతులను ఆదుకోవాలని కవిత డిమాండ్ చేశారు.

# జిల్లాలో సాగునీటికి ఇబ్బంది లేదు

నల్లగొండ,నల్లగొండ జిల్లాలో ఆయా ప్రాజెక్టుల కింద సాగు చేస్తున్న పంటలకు సాగునీరు అందించేందుకు ఇబ్బంది లేదని,ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. యాసంగి సాగులో ఉన్న పంటలకు సాగునీరు అందడం లేదని వస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దన్నారు. రైతులను తప్పుదోవ పట్టించేలా దుష్ప్రచారాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు, ఉదయ సముద్రం ప్రాజెక్టుల కింద ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు ఎలాంటి నీటి కొరతలేదని ఆమె స్పష్టం చేశారు. రబి పంటలకు సాగునీటి విడుదల నిర్వహణపై మంగళవారం రాష్ట్ర మంత్రులు, చీఫ్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన నేపథ్యంలో మంత్రుల ఆదేశాల మేరకు నల్లగొండ పట్టణ సమీపంలో ఉన్న ఉదయ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ను ఇరిగేషన్, రెవెన్యూ వ్యవసాయ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఉదయ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 1.5 టిఎంసిల నీటికి గాను 0.86 టీఎంసీల నీటిని ఉదయ సముద్రం ద్వారా వదలడం జరుగుతున్నదన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు కింద ఉన్న 67,000 ఎకరాలకు ఈ నీరు సాగుబడికి వార బంది ప్రకారం పంట కోత వచ్చేవరకు ఇస్తామని తెలిపారు. అందువల్ల రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. ఉదయ సముద్రం డి-40 కింద ఉన్న 11 -ఎల్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 11 ఎల్ కింద ఉన్న మామిడాల, సర్వారం, ఇందుగుల, గోరింకలపల్లి గ్రామాలన్నిటికీ వారబంది ద్వారా నీరు వస్తుందని, ఈ గ్రామాల తర్వాత కూడా సాగునీరు అందుతుందని స్పష్టం చేశారు. ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించేందుకుగాను రెవెన్యూ ,ఇరిగేషన్, వ్యవసాయ అధికారులతో సంయుక్తంగా ఉదయ సముద్రం ను సందర్శించడం జరిగిందని తెలిపారు. ప్రాజెక్టు కింద నీటి కొరత గాని, తేమ విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని, ఫిబ్రవరి నుండి ఎండలు తీవ్రమైన దృష్ట్యా కొంతవరకు నీరు తగ్గిన మాట వాస్తవమని ఆమె తెలిపారు. ఉదయ సముద్రంకు సాగునీటిని విడుదల చేసిన తర్వాత 30? భూగర్భ జలాలు పెరిగాయని అందువల్ల ఉదయ సముద్రం చుట్టుపక్కల రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని చెప్పారు. ఇరిగేషన్, పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ అధికారులందరూ సాగునీటిని ఎప్పటికప్పుడు నియంత్రణ చేస్తున్నట్లు, ఏ ప్రాంతానికి ఎంత నీటిని ఇవ్వాలనే విషయంపై ప్రతి రోజు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో రైతులు, ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. జిల్లాలోని అన్ని మండల వ్యవసాయ అధికారుల కార్యాలయాలలో ఫిర్యాదుల విభాగాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వ్యవసాయానికి సంబంధించి సాగునీరు, తాగునీటి విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదులు సమర్పించవచ్చని, తక్షణమే సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. నకిరేకల్, మునుగోడు, నల్లగొండ నియోజకవర్గాల్లోని కెనాల్స్ ద్వారా సాగు చేసే భూములకు ఎలాంటి సాగునీటి కొరతలేదని, 10 రోజుల్లో ఇక్కడ కోతలు కూడా పూర్తికానున్నట్లు తెలిపారు. అయితే దేవరకొండ, మిర్యాలగూడ తదితర ప్రాంతాల్లో సాగు చేస్తున్న వేరుశనగ పంటలు ఆలస్యంగా సాగు చేశారని, అక్కడ కూడా పంటలు ఎండిపోకుండా రైతులు ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, ఉదయ సముద్రం ఈఈ శ్రీనివాస్ రెడ్డి కలెక్టర్ వెంట ఉన్నారు.

# నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాం: ఏలేటి

హైదరాబాద్,తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బిజెపి క్రియాశీల పాత్రపోషిస్తుందని బిజెపి స్పష్టం చేసింది. గవర్నర్ ప్రసంగంలో మంచిచెడులను విశ్లేషించి స్పందిస్తామని బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో మాట్లాడుతూ.. గడిచిన డిసెంబర్‌లో మొదటి సారి గవర్నర్ ప్రసంగంలోని అంశాల ఆధారంగా సీఎం రేవంత్ రెడ్డి సంగతి తేలుస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం మీద నెపం తెచ్చే ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలపై మాట్లాడాలన్నారు. బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మాట్లాడుతూ..అంతకు ముందు కాళేశ్వరం మీద అఖిల పక్షం టూర్ పెట్టారని.. ఇప్పుడు ప్రభుత్వానికి ధైర్యం ఉంటే రాష్ట్రంలో 12 వేలకు పైగా గ్రామాల్లో ప్రభుత్వ పనితనంపై అఖిల పక్షం టూర్ పెట్టాలని.. తాము వస్తామని అన్నారు. ఫామ్ హౌస్‌లో పడుకున్న వాళ్ళ గురించి తాము మాట్లాడమని పరోక్షంగా మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కరెంటు, నీళ్లు, విద్య, ఉద్యోగం, రైతాంగం, మహిళలు, నిరుద్యోగ యువత, సంక్షేమ పథకాలపై ప్రతి పక్ష పార్టీగా తామే మాట్లాడతామని అన్నారు. రాష్ట్రం విడిపోక ముందు రూ 800 కోట్లు ఉంటే 2014 తరువాత రూ. 5 వేల కోట్లకు కేటాయింపులు పెరిగాయన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్య మంత్రి అయ్యాక ఎన్ని వేల కోట్లు అప్పులు చేసారో సభలోనే చర్చిద్దామని అన్నారు.

# వసూళ్లలో చైతన్యం... సాఫ్ట్‌గా కరెన్సీ కలెక్షన్

హైదరాబాద్:దేశవ్యాప్తంగా శ్రీ చైతన్య కళాశాలల్లో ఐటీ సోదాలు జరుగుతున్నాయి. విద్యావ్యాపారంలో టైకూన్ శ్రీ చైతన్య కాలేజీలో ఆర్థిక లావాదేవీల్లోని అసలు గుట్టును ఆదాయ పన్ను శాఖ బయటపెట్టేసింది. నోట్ల కట్టల లెక్కలను తీస్తోంది. తెలంగాణ, ఏపీ, ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నైలో సుమారు 30 చోట్ల రెండో రోజూ ఏకకాలంలో తనిఖీలు జరుగుతున్నాయి. హైదరాబాద్‌లోని మాదాపూర్ ప్రాంతంలో నిర్వహిస్తున్న శ్రీ చైతన్య కాలేజ్ హెడ్ క్వార్టర్స్‌లో జరిపిన సోదాల్లో ?2 కోట్లకు పైగా లెక్కలేని నగదును గుర్తించినట్లు ప్రచారం జరుగుతోంది. దేశవ్యాప్తంగా తమ కాలేజీల్లో పెద్ద మొత్తంలో అక్రమ లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. విద్యార్థుల నుంచి నగదు రూపంలో ఫీజు తీసుకుని ఆదాయపన్ను ఎగవేసినట్టు ఐటీ అధికారులు చెబుతున్నారు.

సాఫ్ట్‌గా భారీ వసూళ్లు

విద్యార్థుల నుంచి డబ్బు వసూళ్ల కోసం ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ తయారు చేసి లావాదేవీలు నిర్వహిస్తూ.. ప్రభుత్వానికి చెల్లించే ట్యాక్స్ కోసం మరో సాఫ్ట్ వేర్ తయారు చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. మాదాపూర్‌లోని శ్రీచైతన్య కార్పొరేట్ కాలేజీలో రికార్డులు, డాక్యుమెంట్లు, ఐటీ రిటర్నులు, పన్ను చెల్లింపు రశీదులను పరిశీలించారు. డైరెక్టర్ల కార్యాలయాలనూ తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో కొన్ని కీలకమైన డాక్యుమెంట్లు, రికార్డులను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఫీజుల విషయంలోనూ ఫిర్యాదుల రావడంతో ఈ కాలేజీలపై ఐటీ శాఖ దృష్టి మళ్లింది. ఈ దాడుల్లో పలు కాలేజీలకు అనుమతులు లేవని, హాస్టల్ భవనాలకు అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారని తేలింది. పరిమితికి మించి విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తున్నట్టు అధికారులు గుర్తించారు. కళాశాలల యజమాన్యాలు వెల్లడించిన వివరాలు, సోదాల్లో లభించిన వివరాలను బేరీజు వేసుకుంటున్నట్లు సమాచారం.

డెట్యాక్స్ ఎగ్గొట్టేందుకు యాప్..

సంస్థల్లో చేరుతున్న విద్యార్థులు, ఆదాయానికి సంబంధించిన సమాచారంపై ఆరా తీస్తున్నారు. పన్ను ఎగవేతకు సంబంధించిన దానిపై అధికారులు దృష్టి సారించారు. తాజాగా యలమంచిలి శ్రీధర్ నివాసంలో తనిఖీలు చేస్తున్నారు. మొదట మాదాపూర్ బ్రాంచ్‌లో సోదాలు చేసి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత యలమంచిలి శ్రీధర్ ఇంట్లో కూడా పలు కీలక డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకున్నారు. అటు.. ఖమ్మంలో ఉన్న మరో డైరెక్టర్ నివాసంలో తనిఖీలు చేయడానికి అధికారులు రెడీ అయ్యారు. స్టూడెంట్స్ నుంచి ఫీజులు కట్టించుకొని ప్రభుత్వానికి ట్యాక్సులు కట్టే విషయంలో అవకతవకలు జరిగినట్టు తెలుస్తోంది. ట్యాక్సులు ఎగ్గొట్టడానికి శ్రీ చైతన్య యాజమాన్యం ప్రత్యేకంగా కొన్ని దారులు వెతుక్కున్నట్టు అధికారులు గుర్తించారు. విద్యార్థులతో లావాదేవీలు జరపడానికి సాఫ్ట్‌వేర్, ప్రభుత్వానికి కట్టే టాక్స్ కట్టడానికి మరో సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేసుకున్నారు. రెండు యాప్‌ల ద్వారా స్టూడెంట్స్ నుంచి ఫీజులు వసూలు చేసినట్టు గుర్తించారు. దీంతో ఫీజుల చెల్లింపునకు రెండు యాప్‌లు ఎందుకు అందుబాటులోకి తీసుకొచ్చారనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు.

బ్రాంచీలెన్నీ.. వసూలు చేసిందెంత..

శ్రీచైతన్య విద్యాసంస్థలకు సంబంధించిన మొత్తం ఎన్ని బ్రాంచీలు ఉన్నాయి? ఎంతమంది విద్యార్థులు ఉన్నారు? ఎంతమంది స్టూడెంట్స్ ఆన్లైన్ పేమెంట్ చేశారు? ఓన్లీ క్యాష్ ద్వారా కోట్ల రూపాయల ఫీజుల కట్టించుకొని ట్యాక్సులు ఎగ్గొట్టారని అధికారులు తేల్చారు . మాదాపూర్ బ్రాంచిలో 2 కోట్ల రూపాయలకు పైగా క్యాష్ గుర్తించారు. ఇక దీనితోపాటు.. పలు కాలేజీలకు, భవనాలకు అనుమతులు లేవని తేలింది. పరిమితికి మించి విద్యార్థులకు అడ్మిషన్లు తీసుకుంటున్నారని అధికారులు గుర్తించారు. పలు కీలక డాక్యుమెంట్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ మాదాపూర్ బ్రాంచ్‌లో అధికారులు సోదాలు చేస్తున్నారు. ఇక విజయవాడలోని ప్రధాన కేంద్రంలోని శ్రీ చైతన్య కాలేజీల్లోనూ తనిఖీలు జరుతున్నాయి. దేశవ్యాప్తంగా 30 కేంద్రాల్లో తనిఖీ చేసిన ఐటీ అధికారులు విస్తూపోతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే రూ. 100కోట్ల క్యాష్ లావాదేవీలు అధికారుల దృష్టికి వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది.

# రాహుల్ ప్లానింగ్.. రేవంత్ యాక్షన్.. కారు, సీపీఐ ఫాలో..!!



హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ చేపట్టిన సమగ్ర కుల గణన ప్రభావం మొదలైంది. కాంగ్రెస్ పార్టీ బాటలో పయనించక తప్పని పరిస్థితులు కల్పించారు. కుల గణన పై నిన్నటి వరకు కూని రాగాలు తీసిన పార్టీలు సైతం కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ నిర్ణయానికి జై కొడుతున్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఐదు సీట్లకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. నామినేషన్ దాఖలుకు సోమవారం తుది గడువుగా నిర్ణయించగా, ఆదివారం రాత్రి కాంగ్రెస్ పార్టీతో పాటు సీపీఐ, బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేశాయి. సంఖ్యాబలం ప్రకారం కాంగ్రెస్ ముగ్గురు, సీపీఐ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కక్కరు చొప్పున పేర్లను ప్రకటించాయి. కాంగ్రెస్ నుంచి నటీమణి విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్ పేర్లను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధికారికంగా ప్రకటించింది. సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం యాదవ్, బీఆర్ఎస్ నుంచి దాసోజు శ్రవణ్ కుమార్ పేర్లు వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి సమగ్ర కుల గణన పూర్తి చేసి, లెక్కలు తేల్చారు. ఇటీవలి మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపారు. అయితే కుల గణనలో బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్ రావు కుటుంబ సభ్యులు, ఎంపీ డీకే అరుణ కూడా వివరాలను ఇవ్వలేదు. అయినప్పటికీ సర్వే పూర్తి చేసి వివరాలను సభ్యుల ముందు పెట్టామని రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా చెప్పారు. సమగ్ర సర్వేలో బీసీలు 51 శాతానికి పైగా ఉన్నట్లు తేల్చారు. అయితే కులాల వారీగా వివరాలు వెల్లడించాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన తరువాత స్థానిక సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో అమలుపర్చనున్నారు. బీసీ కులాల సంఖ్య తేలడంతో ప్రధాన పార్టీలు బీసీ పాట పాడక తప్పని పరిస్థితులను కాంగ్రెస్ సర్కార్ కల్పించింది.

కాంగ్రెస్‌లో మూడు వర్గాలకు పెద్దపీట

నటీమణి, తెలంగాణ తల్లి పార్టీ మాజీ నాయకురాలు విజయశాంతిని ఎంపిక చేసి బీసీలపై తమకున్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నది. కళావంతుల కులానికి చెందిన విజయశాంతి కుటుంబం ఉమ్మడి వరంగల్ జిల్లా ఏటూరునాగారం దగ్గర్లోని రామన్నగూడెంలో స్థిరపడింది. నటి, నిర్మాత విజయలలిత ఈమెకు స్వయానా పిన్ని అవుతుంది. బీసీలలో అత్యంత వెనకబడిన కులానికి చెందిన ఆమెను ఎంపిక చేయడం ద్వారా అన్ని వర్గాలకు న్యాయం చేస్తామన్న సంకేతాలను కాంగ్రెస్ పంపించింది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆమె రాష్ట్రంలో కలియతిరిగి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ప్రచారం చేశారు. గత రెండున్నర దశాబ్దాలుగా ఆమె తెలంగాణ రాష్ట్రం కోసం తన గొంతుకను విన్పిస్తున్నారు. టీపీసీసీ నాయకత్వంతో సంబంధం లేకుండా కాంగ్రెస్ అధినాయకత్వం విజయశాంతిని ఎంపిక చేసి ఝలక్ ఇచ్చింది. ఆమె పేరు ప్రకటనతో పలువురు సీనియర్ నాయకులు ఆశ్చర్యపోయారు. ఇక అద్దంకి దయాకర్ విషయానికి వస్తే 2014 నుంచి ఆయన కాంగ్రెస్ పార్టీలో అధికార ప్రతినిధిగా తన వాదనను విన్పిస్తున్నారు. ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ వైఖరిని ప్రశ్నిస్తున్నారు. మాల కులానికి చెందిన దయాకర్ గడిచిన ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించగా, గెలుపు అవకాశాలు లేవంటూ రేవంత్ రెడ్డి నిలువరించారు. మాదిగ కులానికి చెందిన మందుల సామేల్‌కు కేటాయించారు. అయినప్పటికీ ఆయన నిరాశ చెందకుండా పార్టీని అంటిపెట్టుకుని పనిచేశారు. ఆయనకు ఎలాంటి ఆర్థిక బలం లేనప్పటికీ ఎమ్మెల్సీ సీటు ఇచ్చారు. ఇక శంకర్ నాయక్ విషయానికి వస్తే ఆయన నల్లగొండ జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. దామరచర్ల మండలం కేతావత్ తండాకు చెందిన ఆయన మొదటి నుంచి మాజీ మంత్రి కే జానారెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ముద్ర ఉన్నది. నాగార్జునసాగర్, హుజూర్ నగర్, మునుగోడు అసెంబ్లీ ఎన్నికల్లో ఎలక్షన్ ఏజెంట్‌గా పనిచేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారుకు మూడు రోజుల ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బంజారాహిల్స్‌లోని జానారెడ్డి నివాసానికి వెళ్లారు. చర్చల సందర్భంగా శంకర్ నాయక్‌ను ఎంపిక చేయాల్సిందిగా ముఖ్యమంత్రిని కోరినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

తప్పని పరిస్థితుల్లో బీసీకి బీఆర్ఎస్ జై

బీసీ నినాదం బలంగా నడుస్తున్న సమయంలో బీఆర్ఎస్ పార్టీ అదే బాటలో నడవక తప్పని పరిస్థితి ఏర్పడింది. నిన్న మొన్నటి వరకు గెలిచే ఒక్క సీటులో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌ను ఎంపిక చేస్తారని అంతర్గతంగా ప్రచారం సాగింది. రెండో సీటుకు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, దాసోజు శ్రవణ్ పేర్లు విన్పించాయి. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన సత్యవతి లంబాడా కులం. రెండోసారి అధికారంలోకి వచ్చిన కే చంద్రశేఖర్ రావు ఆమెకు గిరిజన సంక్షేమ శాఖను కట్టబెట్టారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చే వరకు పాదరక్షలు వేయనని శపథం చేసినప్పటీ మారిన పరిస్థితుల నేపథ్యంలో కేసీఆర్ మొండి చేయి ఇచ్చారు. పెద్దల సభలో పార్టీ తరపున బలమైన వాదన విన్పించేందుకు మాజీ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ పేరును తెరమీదకు తెచ్చారు. వెలమ కులానికి చెందిన వినోద్‌కు సీటు ఇచ్చేందుకు అనుభవం అనే ప్రచారం చేశారు. అయితే కుల గణనను దాటవేసి నిర్ణయం తీసుకునే ధైర్యం చేయలేకపోయింది బీఆర్ఎస్ పార్టీ. ఎట్టకేలకు ఆదివారం రాత్రి దాసోజు శ్రవణ్ కుమార్ పేరును ప్రకటించక తప్పలేదు.

సీపీఐలో లడాయి

సామాజిక న్యాయం, సమసమాజ స్థాపన పదాలను వల్లెవేసే సీపీఐ పార్టీ సమగ్ర కుల గణనకు జై కొట్టాల్సి వచ్చింది. పొత్తులో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఇచ్చిన ఒక సీటు కోసం అభ్యర్థిని ఎంపిక చేసేందుకు ఆదివారం సాయంత్రం తెలంగాణ సీపీఐ కీలక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో వాడివేడిగా వాదులాటలు జరిగాయని సమాచారం. ఇప్పటికే కమ్మ కులం నుంచి కూనమనేని సాంబశివరావు కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మారిన సమీకరణల నేపథ్యంలో బీసీ కులానికి చెందిన వ్యక్తిని ఎంపిక చేయాలన పలువురు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలపై రాష్ట్ర పార్టీ మాజీ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారని సమాచారం. పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన తనకు అవకాశం ఇవ్వాలని వాదులాటకు దిగినట్లు సమాచారం. ఇదే అదనుగా తనకు అవకాశం కల్పించాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర సమితి కార్యవర్గ సభ్యులు తక్కెళ్లపల్లి శ్రీనివాస్ రావు కోరగా, నాయకత్వం ససేమిరా అన్నట్లు పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు. ఏకాభిప్రాయం లేనప్పటికీ నల్లగొండ జిల్లా సీపీఐ కార్యదర్శి నెల్లికంటి సత్యం యాదవ్ పేరును ఖరారు చేశారు. మునుగోడు ఉప ఎన్నిక, వరంగల్‌లో జరిగిన రాష్ట్ర మహాసభల్లో ఇచ్చిన హామీ మేరకు సత్యానికే సీటు ఇవ్వాలని రాష్ట్ర పార్టీ నిర్ణయం తీసుకున్నప్పటికీ, ఆలస్యంగా పేరును ప్రకటించారు.

బీసీ నినాదంతో మైనారిటీలు వెనక్కి

కుల గణనతో ముస్లిం మైనారిటీ వాదాన్ని ప్రధాన పార్టీలు కొద్దికాలం పాటు ప్రధాన పార్టీలు పక్కనపెట్టాల్సిన పరిస్థితి దాపురించింది. కాంగ్రెస్ నిర్ణయించిన మూడింటిలో ఒక సీటును ముస్లిం మైనారిటీకి ఇవ్వాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. కుల గణన చేశామని చెప్పుకొంటున్న కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీతో పాటు బీసీకి సీట్లను కేటాయించింది. దీంతో ముస్లిం మైనారిటీ నుంచి పోటీపడిన పలువురు నిరాశకు గురయ్యారు. ప్రస్తుతం ప్రభుత్వ సలహాదారుడిగా ఉన్న మాజీ మంత్రి మహ్మద్ షబ్బీర్ అలీ ప్రధానంగా పోటీలో ఉన్నారు. తనకు ఎమ్మెల్సీ సీటు దక్కుతుందని, తద్వారా క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం లభిస్తుందని గంపెడాశతో ఉన్నారు. తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ చైర్మన్ ఫహీమ్ ఖురేషీ ఎమ్మెల్సీ కావడమే కాకుండా డిప్యూటీ సీఎంగా వస్తున్నానని పార్టీలో ప్రచారం చేసుకున్నారు. తనకు ఢిల్లీ నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద పలుకుబడి ఉందని చెప్పుకొని తిరిగారని కాంగ్రెస్ కార్యకర్తలు చెబుతున్నారు. ఎన్నికలకు ముందు వరకు బీఆర్ఎస్‌లో పనిచేసి, ఎమ్మెల్సీ కే కవితకు సన్నిహితంగా ఉన్న ఆయనకు ఎమ్మెల్సీ ఎలా ఇస్తారంటూ ముస్లిం మైనారిటీ నాయకులు ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేశారు. వీరిద్దరే కాకుండా మరికొందరు తమ ప్రయత్నాలు చేసినప్పటీ బీసీ వాదం ముందు నిలబడలేకపోయారు.

# జనాభా పెరుగుదల ప్రస్తుత ఆవశ్యకత

అమరావతి,జనాభా తగ్గడం వల్ల ఎంపీ సీట్లు తగ్గుతాయనే భావన ఉంది. నేనలా ఆలోచించటం లేదు. మనకు దేశం ముఖ్యం.. తర్వాతే రాష్ట్రం. దక్షిణాది రాష్ట్రాలు మేల్కొనాల్సిన సమయం వచ్చింది. జనాభా పెరుగుదల గురించి ఆలోచించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఏపీ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 'పాపులేషన్ డైనమిక్ డెవలప్‌మెంట్' సదస్సు జరిగింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న సీఎం మాట్లాడుతూ... సాధారణ ప్రసవాలు పెరగాలి, సిజేరియన్లు తగ్గాలన్నారు. రెండు జీతాలు, ఒక్క సంతానం చాలని చాలా మంది అనుకుంటున్నారు. జనాభా పెరుగుదలపై నిశ్శబ్దం వీడాలి, చర్చ జరగాలన్నారు. ప్రభుత్వం కూడా జనాభా పెరుగుదలకు చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రసూతి సెలవులు ఎన్ని కాన్పులకైనా ఇస్తామని సీఎం ప్రకటించారు. మన కుటుంబ వ్యవస్థ ప్రపంచంలోనే అద్భుతం. జనాభా పెంచాలనే ప్రతిపాదనతో ఇప్పుడు ముందుకెళ్తున్నాం. తెలుగువారు ప్రపంచంలో అన్ని చోట్లా కీలకంగా పనిచేస్తున్నారు. కీలక రంగాల్లో అగ్రగామిగా ఉన్నారు. జపాన్, జర్మనీ.. భారతీయుల కోసం ఎదురు చూస్తున్నాయి. ప్రపంచంలోని ప్రతి కంపెనీని భారతీయులే నడపాలని కోరుకుంటున్నా. తెలంగాణకు అధిక ఆదాయం రావటానికి అప్పట్లో తెదేపా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలే కారణం అని పునరుద్ఘాటించారు. నిత్య విద్యార్థిని, నిరంతరం నేర్చుకోవటం నాకు ఇష్టం. నీటి లభ్యత , ఆహారం ఉత్పత్తి పెరగకుండా జనాభా పెరిగితే ఇబ్బందులు వస్తాయి. అందుకే జనాభా నిర్వహణ గురించి ఇప్పుడు చర్చ చేస్తున్నాం. అప్పట్లో జనాభా తగ్గుదల గురించి గట్టిగా పని చేశా. 20 ఏళ్ల తర్వాత ఇప్పుడు జనాభా పెరుగుదల గురించి మాట్లాడాల్సి వచ్చింది. రూ. లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చేలా అమరావతి నిర్మాణం చేపట్టామని అన్నారు. ప్రధానిమోదీ వికసిత్ భారత్, నేను విజన్ 2047 అంటున్నాం. ఐదేళ్లుగా రాష్ట్రంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారు. అమరావతి నిర్మాణం కొనసాగి ఉంటే ఈపాటికి ఇక్కడ రూపురేఖలు మారిపోయేవి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయి. రూ. లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చేలా అమరావతి నిర్మాణం జరగబోతోంది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విస్తరణకు అవసరమైన భూమి, నీరు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. అంకుర కేంద్రం ఏర్పాటు చేయాలని ఎస్ఆర్ఎంను కోరా. ఉద్యోగాలు చేసే వారిని కాకుండా ఉద్యోగాలు ఇచ్చే వారిని తయారు చేయాలని సూచించా. రాష్ట్రంలో ఇప్పుడు 2.58 లక్షల తలసరి ఆదాయం మాత్రమే ఉంది. 2047 కల్లా ప్రజల తలసరి ఆదాయం రూ. 58 లక్షలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం అని చంద్రబాబు వివరించారు. పది సూత్రాల ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. పేదరికం లేని సమాజం కోసమే పీ4 విధానం. పేదలను పైకి తెచ్చేందుకు ప్రభుత్వాలు చేసే పనులతో పాటు మీరు కూడా సహకరించాలి. ప్రభుత్వ- ప్రైవేటు భాగస్వామ్యంతో సంపద పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలి. ఉద్యోగాల కల్పన చాలా ముఖ్యం. హార్డ్ వర్క్ కంటే స్మార్ట్ వర్క్ ముఖ్యం. పని విధానంలో మార్పులు రావాలి. ఉత్పాదకత పెరిగేలా, ఫలితాలు ఉండేలా పని చేయాలి. చదువుకున్న మహిళలు ఇంటి నుంచే పని చేసేలా ప్రణాళికలు. మగ వారికంటే మహిళలు బాగా పని చేయగలుగుతారు. ఐటి ఉద్యోగుల్లో మహిళలు మగవారి కంటే ఎక్కువ జీతాలు పొందుతున్నారు. సాంకేతికత సాయంతో వ్యవసాయం చేయాలి. గ్రీన్ ఎనర్జీకి అధిక ప్రాధాన్యత ఇచ్చి ఇంధన రంగంలో అగ్రగామిగా ఎదగాలి. అమరావతి మొత్తం సోలార్ ఎనర్జీ సరఫరా ఉండేలా చూస్తాం. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఉపయోగించుకునేలా చర్యలు తీసుకుంటాం. అన్ని రంగాలకు క్వాంటం కంప్యూటింగ్ అనుసంధానం చేస్తామని చంద్రబాబు వివరించారు.

# టీడీపీ తట్టుకోగలదా ?

అమరావతి,రాజకీయాల్లో ఎవరు పెద్ద ఎవరు చిన్న అన్నది ఉండదు. పరిస్థితులు అవకాశాలే ఎపుడూ పెద్ద. అలాగే వ్యూహాలే ఎపుడూ విజయాలు అందిస్తాయి. ఆ విధంగా చూస్తే 2024లో టీడీపీ కూటమి ఏపీలో అధికారంలోకి రావడానికి కారణం ఎవరు అంటే అనేక అంశాలు దీని వెనక బలంగా పనిచేశాయి. అందులో పవన్ కళ్యాణ్ ఫ్యాక్టర్ కూడా ఒకటి అని విశ్లేషణలు ఉన్నాయి. అదే సమయంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అండదండలు కూడా అతి ముఖ్యంగా సహకరించాయి. అలాగే యాభై ఏళ్ళ రాజకీయ అనుభవం కలిగిన దిగ్గజ నేత చంద్రబాబు చాణక్య రాజకీయం కూడా చాలా బలంగా పనిచేసింది. ఇలా ప్రతీ అంశమూ కూడా కూటమి విజయం వెనక ఉంది. అయితే క్రెడిట్ ని ఎవరు తీసుకోవాలీ అంటే సమిష్టిగానే అని చెప్పాలి. ఇక్కడే ఎవరి వాదనలు వారికి ఉంటాయనిపిస్తుంది. జనసేన విషయం తీసుకుంటే ఆ పార్టీ అధినేత పవన్ కి విపరీతమైన గ్లామర్ ఉంది. ఆయన వెనక బలమైన సామాజిక వర్గం ఉంది. యువత మహిళాలలో విశేషంగా క్రేజ్ ఉంది. దాంతో పవన్ ఫ్యాక్టర్ బ్రహ్మాండంగా పనిచేసింది అని చెప్పాలి. ఇక కూటమి కట్టాలని 2022 నుంచే పవన్ చెబుతూ వచ్చారు. ఆ విషయంలో ఆయన తుదివరకూ పట్టుదల పట్టారు. తనకు కేటాయించిన 24 ఎమ్మెల్యే సీట్లను 21కి కుదిరించున్నారు. అలాగే అనకాపల్లి ఎంపీ టికెట్ తన సొంత అన్నకు ఇచ్చినా కూడా వెనక్కి తీసుకుని బీజేపీకి వచ్చేలా చూశారు. ఇలా పవన్ ఫ్యాక్టర్ ఈ ఎన్నికల్లో విజయానికి ఎంతో ఉపయోగపడింది అని చెప్పాలి. అయితే అదే సమయంలో తెలుగుదేశం పార్టీ బూత్ లెవెల్ దాకా బలంగా ఉంది. ఎంత గ్లామర్ ఉన్నా మరెంత పట్టుదల ఉన్నా పార్టీ కూడా పటిష్టంగా ఉంటేనే సాధ్యపడతాయి. అందువల్ల చూసుకుంటే టీడీపీ ఏపీలో అత్యంత బలమైన పార్టీ. సుశిక్షితులైన పార్టీ క్యాడర్ బలంగా ఉంది. అంతే కాదు అంకితభావంతో పనిచేసే క్యాడర్ టీడీపీ సొంతం. ఇక పొత్తులు ఎత్తుల విషయంలో బాగా పండిపోయిన చంద్రబాబు చాకచక్యం కూడా ఎంతగానో ఉపకరించింది అని చెప్పాలి. ఆశావహులు ఎంతో మంది ఉన్నా అందరినీ కూర్చోబెట్టి బుజ్జగించి దారికి తెచ్చుకోవడంలో బాబుకే క్రెడిట్ ఇవ్వాలి. అలాగే కేంద్రం సాయం అందించినా దానికి ఎపుడు ఎక్కడెక్కడా వాడాలి అన్ని పూర్తిగా తెలిసిన వారుగా బాబుని చూడాలిఈ విధంగా అందరూ కలసిన మీదటనే కూటమి ఘన విజయం సాధించింది అని చెప్పవచ్చు. అయితే ఇటీవల కాలంలో పిఠాపురం పీటముడి పడి టీడీపీ జనసేనల మధ్య సంబంధాలను కొంచెం ఇబ్బంది పెడుతోంది. తాను చంద్రబాబు మాట మీద పనిచేశాను త్యాగం చేశాను తనకు తగిన పదవి దక్కలేదని వర్మ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో పిఠాపురం టీడీపీ నేతలు అంతా వర్మకు పదవి దక్కకపోవడం అంతా జనసేన స్కెచ్ అని ఆడిపోసుకుంటున్నారు. ఈ క్రమంలో పిఠాపురంలోని ఈ రాజకీయ మంటలు కాస్తా ఏకంగా ఏపీలో చంద్రబాబు దాకా వెళ్తున్నాయి. జనసేనలో నంబర్ టూగా ఉన్న నాదెండ్ల మనోహర్ అయితే పార్టీ క్యాడర్ మీటింగులో మాట్లాడుతూ పవన్ లేకపోతే కూటమికి అధికారం లేదు, చంద్రబాబు సీఎం కూడా అయింది పవన్ పట్టుదల వల్లనే అని హాట్ కామెంట్స్ చేశారు. పవన్ ఎంతో తగ్గి వ్యవహరించారని అందరినీ కలుపుకున్నారని, పొత్తుల విషయంలో ఎంతో ఆలోచించారని నాదెండ్ల చెప్పారు. ఇదంతా దేనికి అంటే ఒక్క ఎమ్మెల్సీ సీటు కోసం జనసేన మీద లోకల్ టీడీపీ నేతలు విమర్శలు చేస్తూండడంతో జనసేన నేతలు కూడా మేము లేకపోతే మీ అధినేతకే

# విజయసాయి రెడ్డికి సీఐడీ,ఆర్కే రోజాకు ఏసీబీ సెగ..



అమరావతి,ఆ కేసు అప్పట్లో పెద్ద వివాదమైంది. ఆ నేత వెంటనే పదవిని, పార్టీని వదులుకున్నారు. ఏకంగా పాలిటిక్స్‌కు గుడ్‌బై చెప్పారు. చంద్రబాబుతో వైరం లేదన్నారు. పవన్ కల్యాణ్ అంటే గౌరవం అంటూ కవర్ చేసుకునే ప్రయత్నం చేశారు. అయినా ఆయనను కేసులు వీడటం లేదు.ఏ కేసు భయంతో అయితే ఆయన వైసీపీని వీడారని ప్రచారం జరిగిందో.. ఇప్పుడదే కేసులో సీఐడీ నోటీసులు అందాయి. అంతేకాదు ఓ మహిళా నేత టార్గెట్‌గా ఏసీబీ దర్యాప్తు స్టార్ట్ అవుతోంది. ఈ కేసుల ఎపిసోడ్‌లో నెక్ట్స్ టార్గెట్ ఎవరు? ఓవైపు అవినీతి, ఇంకోవైపు అనిశ్చిత వ్యాఖ్యలపై వరుస విచారణలతో ఏం జరగబోతోంది.?సింగిల్ లైన్ ఎజెండా. అప్పటి యాక్షన్‌కు ఇప్పుడు రియాక్షన్ ఉండాల్సిందే. ఇదే లైన్‌ను ఫాలో అవుతోంది కూటమి సర్కార్. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చెలరేగిపోయి, తమను ఇబ్బంది పెట్టిన నేతల టార్గెట్‌గా పావులు కదుపుతున్నారనేది ఓపెన్ సీక్రెట్. వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులుగా పని చేసిన వారితో పాటు పార్టీని భుజానికెత్తుకుని.. అప్పటి ప్రతిపక్ష నేతలు చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌పై ఇష్టమొచ్చినట్లు మాట్లాడిన నేతలపై వరుస కేసులు బుక్ అవుతున్న పరిస్థితి. ఎవరికీ మినహాయింపు ఉండదన్నట్టుగా అడుగులు వేస్తోంది కూటమి ప్రభుత్వం.లేటెస్ట్‌గా మాజీ ఎంపీ విజయసాయికి ఏపీ సీఐడీ నోటీసులు ఇచ్చింది. రాజకీయ సన్యాసం తీసుకున్నప్పటికీ ఆయనను వదిలట్లేదన్న చర్చ జరుగుతోంది. కాకినాడ పోర్టు వాటాల బదిలీ ఇష్యూలో విచారణకు హాజరుకావాలంటూ విజయసాయిరెడ్డికి ఏపీ సీఐడీ నోటీసులు జారీ చేయడం హాట్ టాపిక్‌గా మారింది.

కాకినాడ సీపోర్టు వాటాలను బలవంతంగా లాక్కున్నారనే ఆరోపణలు..

మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తర్వాత నెక్ట్స్ ఎవరు? అన్న ప్రశ్నకు సినీ నటుడు పోసాని కృష్ణమురళి అరెస్ట్‌తో సస్పెన్స్‌కు తెరదించినట్లు అయింది. ఇప్పుడు పోసాని తర్వాత ఉమ్మడి కృష్ణా లేదా రాయలసీమ నేతలు క్యూలో ఉండొచ్చన్న టాక్ వినిపిస్తుండగా.. ఎవరి ఊహలకు అందకుండా వైసీపీ మాజీ నేత విజయసాయిరెడ్డి కేసు తెరమీదకు వచ్చింది.కాకినాడ సీపోర్టు వాటాలను బలవంతంగా లాక్కున్నారనే ఆరోపణలపై గతేడాది డిసెంబర్‌లో విజయసాయిరెడ్డిపై కేసు నమోదైంది. ఈ కేసులో ఇప్పటికే ఈడీ విచారణను ఎదుర్కొన్న విజయసాయిరెడ్డికి ఇప్పుడు సీఐడీ నుంచి పిలుపు వచ్చింది.కాకినాడ సీపోర్టు యాజమాని కేవీ రావు ఫిర్యాదుతో విజయసాయిరెడ్డితో పాటు పలువురిపై కేసు నమోదైంది. అయితే ఈ విషయంపై దర్యాప్తు సంస్థలు ఫోకస్ చేయడంతో కాకినాడ పోర్టు వాటాలు దక్కించుకున్న అరబిందో కంపెనీ సీపోర్టు వాటాలను వెనక్కి ఇచ్చింది. పెద్దల సమక్షంలో రాజీ కుదిరినా, కేసు మాత్రం వాపసు తీసుకోకపోవడంతో సీఐడీ రంగంలోకి దిగింది. దాంతో వైసీపీ మాజీ నేతకు ఉచ్చు బిగించేలా అడుగులు వేస్తోందని అంటున్నారు.

రాజకీయాల్లో ఉన్నా లేకున్నా వారిని వదిలేది లేదు..!

వాస్తవానికి కేసు రాజీ అయిన తర్వాత పోలీసు చర్యలు ఉండవని విజయసాయి భావించినట్లు చెబుతున్నారు. కానీ వాటాలు రిటర్న్ ఇవ్వడంతోనే ఇంకా ఇరికిపోయారన్న చర్చ జరుగుతోంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు విజయసాయిరెడ్డి చంద్రబాబుపై అడ్డగోలుగా మాట్లాడారని.. టీడీపీ నేతలను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని కూటమి నేతలు చెబుతున్నారు. కాబట్టి రాజకీయాల్లో ఉన్నా లేకున్నా అడ్డగోలుగా వ్యవహరించినోళ్లను వదిలిపెట్టే ప్రసక్తే లేదంటున్నారు. కాకినాడ సీపోర్టు కేసే కాదు.. మాజీ స్పీకర్ కోడెల కేసు కూడా..విజయసాయిరెడ్డి మెడకే చుట్టుకునేలా కనిపిస్తోంది. 2019లో కోడెల శివప్రసాదరావు సూసైడ్ చేసుకున్నారు. కోడెల ఆత్మహత్య వెనక అప్పటి వైసీపీ ప్రభుత్వం వేధింపులు ఉన్నాయని టీడీపీ నేతలు ఆరోపించారు. అలా రాజకీయ రచ్చ నడుస్తూ వచ్చింది. ఇంతలోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కేసు మళ్లీ లైమ్‌లైట్‌లోకి వచ్చేసింది.

కోడెల కేసు విజయసాయిరెడ్డికి తలనొప్పిగా మారే అవకాశం..

అయితే కోడెల ఆత్మహత్య వెనక వైసీపీ మాజీ నేత విజయసాయిరెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఉన్నారని ఆరోపిస్తూ టీడీపీ నేతలు నరసరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆరేళ్ల క్రితం నాటి కోడెల కేసు ఇప్పుడు మళ్లీ జీవం పోసుకుని ఏ మలుపు తిరుగుతుందోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది. రాజకీయాలకు గుడ్‌బై చెప్పినప్పటికీ కాకినాడ పోర్టు వాటాల వ్యవహారం, కోడెల కేసు విజయసాయిరెడ్డికి తలనొప్పిగా మారే అవకాశం ఉంది.

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భారీ అవినీతి?

ఇక వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు ఆరోపిస్తోంది కూటమి. ఈ విషయంపై ఏపీ అసెంబ్లీలో చర్చ జరిగిన తెల్లారే ఏసీబీ విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. ఆడుదాం ఆంధ్రా కోసం గత ప్రభుత్వం రూ.120 కోట్లు విడుదల చేస్తే..అందులో మేజర్ అమౌంట్ పక్కదారి పట్టినట్లు అలిగేషన్స్ చేస్తున్నారు టీడీపీ నేతలు.ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం చేపట్టినప్పుడు ఏపీ స్పోర్ట్స్ మినిస్టర్‌గా ఆర్కే రోజా ఉన్నారు. ఆమె టర్మ్‌లోనే పెద్దఎత్తున స్కామ్ జరిగిందని ఆరోపిస్తూ వస్తున్నారు కూటమి నేతలు. ఇప్పుడు ఏసీబీ విచారణతో రోజా చుట్టూ ఉచ్చు బిగించే ప్రయత్నం జరుగుతోందన్న టాక్ వినిపిస్తోంది. రోజా కూడా వైసీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు, లోకేశ్, పవన్‌పై సెటైర్లు వేయడం వంటివి గుర్తు చేస్తున్నారు.ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ అప్పుడప్పుడు ప్రెస్‌మీట్లు పెడుతూ కూటమి ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ వస్తున్నారు. ఇలా గత సర్కార్ హయాంలో చెలరేగిన వారిపై వరుస కేసులు నమోదవుతూ వస్తున్నాయి. నెక్ట్స్ టార్గెట్ ఎవరో చూడాలి మరి.

# దేవినేని ఉమాకు ఎమ్మెల్సీ రాకుండా చెక్ పెట్టిన ఆ ఇద్దరు..?



అమరావతి,దేవినేని ఉమామహేశ్వరరావు కృష్ణా జిల్లా రాజకీయాల్లో ఒకప్పుడు కింగ్... ఇక తెలుగుదేశం రాజకీయాలను అయితే 1999 ఎన్నికల నుంచి 2019 ఎన్నికలకు ముందు వరకు తానే నడిపించారు. నాలుగుసార్లు ఓటమి లేకుండా గెలవడంతో కృష్ణా జిల్లా తెలుగుదేశంలో ఆయన హవా అంతా ఇంతా కాదు అన్నట్టుగా నడిచింది. నందిగామ నుంచి 1999, 2004లో నందిగామ నుంచి ఆ తర్వాత 2009, 2014లో మైలవరం నుంచి గెలిచారు. మరీ ముఖ్యంగా పార్టీ ప్రతిపక్షంలో ఉన్న పదేళ్లలో ఉమా చేసిన పోరాటాలకే ఆయనకు చంద్రబాబు కీలకమైన భారీ నీటిపారుదల శాఖ మంత్రి పదవి కట్టబెట్టారు. అయితే టీడీపీలో జిల్లాలో ఒంటెద్దు పోకడలతో కూడిన రాజకీయం చేయడంతోనే జిల్లాలో కొడాలి నాని, కేశినేని నాని, వల్లభనేని వంశీ, మండలి బుద్ధప్రసాద్, దాసరి బాలవర్ధన్‌రావు లాంటి వారు టీడీపీకి దూరమయ్యారు. ఇక నెట్టెం రఘురాంతో పాటు బొండా ఉమాతోనూ.. ఇలా ఎవ్వరితోనూ ఉమాకు సరిపోదు. ఇక 2019 ఎన్నికల్లో ఓటమి తర్వాత ఉమా ప్రాభవం జిల్లాలో తగ్గుతూ వచ్చింది. చివరకు 2019 ఎన్నికల నాటికి ఉమాకు ఎమ్మెల్యే సీటే రాని పరిస్థితి వచ్చేసింది.జిల్లాలో ఉన్న మిగిలిన టీడీపీ నేతలు అందరూ ఉమా తీరుపై చంద్రబాబు కంటే కూడా లోకేష్‌కు ఎక్కువగా ఫిర్యాదు చేయడంతో లోకేష్ ఎఫెక్ట్‌తోనే ఉమా సీటు చిరిగిపోయిందన్న టాక్ కూడా పార్టీలో ఉంది. మొన్న ఎన్నికల్లో తన చిరకాల రాజకీయ ప్రత్యర్థి తాను 2019లో ఓడిపోయిన వసంత కృష్ణప్రసాద్‌కు టీడీపీ సీటు రాగా ఉమా తన సీటు త్యాగం చేశారు. అప్పుడే చంద్రబాబు ఉమాకు ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే తాజా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమా పేరు ముందు రేసులో ఉన్నా విజయవాడ ఎంపీ కేశినేని చిన్నితో పాటు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఇద్దరూ చక్రం తిప్పి ఉమాకు ఎమ్మెల్సీ రాకుండా చేశారన్న గుసగుసలు జిల్లా పార్టీ వర్గాల్లో వినిపిస్తున్నాయి.ఉమాకు ఎమ్మెల్సీ ఇస్తే మైలవరం, జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో రెండో గ్రూప్‌తో పాటు మరో పవర్ సెంటర్ ఏర్పడుతుందని.. అప్పుడే ఉమాకు ఎమ్మెల్సీ ఇవ్వకుండా మరో రెండేళ్ల తర్వాత ఇవ్వాలని చిన్ని, వసంత చంద్రబాబు దగ్గర, లోకేష్ దగ్గర పట్టుబట్టడంతోనే ఉమాకు ఎమ్మెల్సీ రాలేదని అంటున్నారు. ఏదేమైనా ఉమా రాజకీయ ప్రభ రోజు రోజుకు మరింత మసకబారుతోందన్నది వాస్తవం.

# రేవంత్ తో ఢీ కొట్టేందుకు బాబు రెడీ !



హైదరాబాద్,తెలంగాణాలో తెలుగుదేశం పుట్టింది. ఉమ్మడి ఏపీని ఎన్టీఆర్ ఏడేళ్ళ పాటు పాలిస్తే చంద్రబాబు తొమ్మిదేళ్ల పాటు పాలించారు. ఆ విధంగా చూస్తే టీడీపీకి తెలంగాణాలో మంచి పట్టు ఉంది ఆదరణ కూడా ఉందని చెప్పాలి. ఈ రోజుకీ చంద్రబాబు విజన్ అంతా హైదరాబాద్ లో కనిపిస్తుంది. పల్లెల్లో అన్న గారి సంక్షేమ పథకాలు ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాల గుర్తులు కనిపిస్తాయి.అటువంటి తెలంగాణాతో తెలుగుదేశం బంధం ఒక భావోద్వేగమైన అంశంతో కాస్తా ఇబ్బంది పడింది. 2014లో 15 ఎమ్మెల్యేలు గెలుచుకున్న టీడీపీ 2018 నాటికి మూడు సీట్లకే పరిమితం అయింది. 2023లో పోటీ చేయలేదు. అయితే టీడీపీకి ఈ రోజుకీ హైదరాబాద్ ఖమ్మం, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్ నగర్ వంటి జిల్లాలలో మంచి ఓటు బ్యాంకు ఉందని అంటారు.ఇక పార్టీని వీడి బీఆర్ ఎస్ బీజేపీ కాంగ్రెస్ లలో చాలా మంది నేతలు చేరిపోయారు. ఇపుడు అక్కడ కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో బీఆర్ఎస్ ప్రతిపక్ష పాత్రలోకి రావడంతో టీడీపీ ఎదిగేందుకు ఇదే సరైన తరుణం అని టీడీపీ పెద్దలు భావిస్తున్నారు. తెలంగాణా టీడీపీలో మాజీ నేతలను తిరిగి చేర్చుకునే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు.వారికి ఘర్ వాపసీ పేరుతో పిలుపులు వెళ్తాయని అంటున్నారు. అదే విధంగా తొలి బోణీగా గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో పోటీ చేయడానికి టీడీపీ అధినాయకత్వం నిర్ణయించింది అని వార్తలు వస్తున్నాయి. 2015లో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో పోటీ పడిన తరువాత మళ్ళీ టీడీపీ ఎన్నికల గోదాలోకి దిగలేదు. కానీ ఈసారి అలా కాదు అని అంటోంది.అయితే పక్కా లెక్కలతోనే టీడీపీ తెలంగాణాలో రీ ఎంట్రీ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది అని అంటున్నారు. కేవలం తాము మాత్రమే కాకుండా జనసేన బీజేపీలను కలుపుకుని ఎన్డీయే కూటమిగా గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో పోటీకి దిగితే మంచి ఫలితాలు వస్తాయని అంచనా వేస్తున్నారు.తమకు బలమున్న చోటనే పోటీకి అభ్యర్ధులను నిలిపి వారిని గెలిపించుకుంటే పార్టీ ఇమేజ్ పెరుగుతుందని అది 2028 అసెంబ్లీ ఎన్నికల నాటికి బలపడుతుందని టీడీపీ పెద్దలు లెక్క వేస్తున్నారు. ఈ నేపధ్యంలో యాక్షన్ ప్లాన్ ని టీడీపీ రెడీ చేస్తోంది అని అంటున్నారు.ఇదిలా ఉంటే తెలంగాణాలో తెలుగుదేశం రంగంలోకి దిగితే నేరుగా కాంగ్రెస్ ప్రభుత్వాన్నే విమర్శించాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఢీ కొట్టాలి. ఒకనాడు టీడీపీలో ఉంటూ బాబు శిష్యునిగా ముద్రపడిన రేవంత్ రెడ్డి మీదనే టీడీపీ పోరు సాగించాలన్నది ఒక వింత అయిన అనుభవమే. కానీ రాజకీయాల్లో తమ్ముడు తమ్ముడే అన్నది నీతి. సో రేవంత్ రెడ్డి మీద టీడీపీ పోరాటం సాగుతుందనే అంటున్నారు. మరో వైపు బీజేపీ ఘాటుగానే కాంగ్రెస్ ని విమర్శిస్తోంది. ఆ మిత్రపక్షంగా టీడీపీ సైతం అదే బాటలో నడవాల్సి ఉంది. సో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో అమీతుమీకి టీడీపీ రెడీ అంటోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# విజయశాంతికి హెూం శాఖ? లేదంటే విద్యాశాఖ?



హైదరాబాద్,ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ ముందు అనూహ్యంగా తెరమీదకు వచ్చిన సినీనటి ఎం విజయశాంతి మరో రెండు రోజుల్లో ఏకగ్రీవంగా ఎమ్మెల్సీగా ఎన్నికకాబోతున్నారు. ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి అభీష్టానికి వ్యతిరేకంగా విజయశాంతి ఢిల్లీలోని అధిష్ఠానం ఆశీస్సులతో ఎమ్మెల్సీ పదవి దక్కించుకున్నారనే చర్చ నడుస్తున్నది. అయితే విజయశాంతి పెద్దల సభలో అడుగుపెట్టడంతోనే ఆగుతారా? లేక మంత్రివర్గంలోకి సైతం ప్రవేశిస్తారా? అన్న కొత్త చర్చ ఊపందుకున్నది. అనుకున్నదొక్కటి.. అయ్యిందొక్కటి.. బోల్తా కొట్టిందిలే బుల్ బుల్ పిట్ట అనేది రేవంత్ రెడ్డికి సరిపోలుతుందేమో. కొద్ది రోజుల క్రితం ఒక నాయకుడు విజయశాంతి అంశాన్ని రేవంత్ ముందు ప్రతిపాదించగా, ఆమెను రాజ్యసభకు పంపిస్తానని, ఇక్కడ మాత్రం ఉండనివ్వనని చెప్పారంట! ఆమె మనస్తత్వం ఏ క్షణంలో ఎలా ఉంటుందో చెప్పలేమని, వేగడం కూడా కష్టమని వ్యాఖ్యానించారని విశ్వసనీయ సమాచారం. ఢిల్లీలో పార్టీ పెద్దలు ఏమి ఆలోచించారో ఏమో తెలియదు కానీ.. అనూహ్యంగా ఆమె పేరు తెరమీదకు రావడం, నామినేషన్ వేయడం కూడా జరిగిపోయాయి. ఈమె స్థానంలో తన స్నేహితుడు, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీగా ఎంపిక చేయించుకోవాలని ప్రయత్నించినప్పటికీ సీఎం సఫలం కాలేకపోయారన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కాగా విజయశాంతి అసెంబ్లీలో నామినేషన్ దాఖలు చేసే రోజు పక్కనే మాజీ ఎంపీ మధుయాష్కి ఉండటం రేవంత్ వర్గీయులకు మింగుడు పడటం లేదట! మధు యాష్కీకి నేరుగా ఢిల్లీ పెద్దలతో సంబంధాలు ఉన్నాయి.

మంత్రి పదవి ఖాయం?

స్థానిక ఎన్నికలకు ముందు లేదా తరువాత జరిగే మంత్రివర్గ విస్తరణలో విజయశాంతికి బెర్త్ దక్కడం ఖాయమంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద కీలకమైన మునిసిపల్, విద్య, హెూం శాఖలు ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఆయనే ఈ శాఖలను పర్యవేక్షిస్తున్నారు. విస్తరణ ఎప్పుడంటే అదిగో ఇదిగో అంటూ వాయిదా పడుతూ వస్తున్నది. మంత్రులు ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క వద్ద కీలకమైన శాఖలు అదనంగా ఉన్నాయి. వీరిద్దరి శాఖల్లో కోత వేయాలని సహచర మంత్రులు ఢిల్లీకి ఫిర్యాదులు పంపుతునే ఉన్నారు. విజయశాంతి నామినేషన్ వేసిన మరుక్షణం నుంచే హెూం మంత్రి అవుతారంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం ఊపందుకున్నది. రేవంత్ రెడ్డితో పాటు మరికొందరు మంత్రుల దూకుడుకు పగ్గాలు వేసేందుకు విజయశాంతితో పాటు మరికొందరికి అవకాశం కల్పించాలని అధిష్ఠానం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చిందంటున్నారు. అది ఎప్పుడు కార్యరూపం దాల్చుతుందనేది స్పష్టంగా తెలియనప్పటీ స్థానిక ఎన్నికల ముందు లేదా తరువాత ఖచ్చితంగా అమలవుతుందని కాంగ్రెస్ నాయకుడొకరు పేర్కొన్నారు. హెూంమంత్రి అవుతారా? లేక విద్యాశాఖ నిర్వహిస్తారా? అనేది ముమ్ముందు తెలియనున్నది. విస్తరణ జరగకపోవడానికి కారణం కూడా ఉంది. బీఆర్ఎస్ నుంచి చేరిన వారిపై సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నది. ఎప్పటిలోగా అనర్హత వేటు వేస్తారో చెప్పాలంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు ఇటీవలే నోటీసు పంపించి మార్చి మూడో వారానికి కేసు వాయిదా వేసింది.

మీనాక్షి, విజయశాంతి ఒకేసారి ఎంపీలు

మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి మీనాక్షి నటరాజన్ పార్లమెంటు సభ్యురాలిగా 2009–2014 వరకు ప్రాతినిధ్యం వహించారు. మీనాక్షి ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలు చూస్తున్నారు. విజయశాంతి కూడా 2009–2014 మధ్య మెదక్ నుంచి బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎంపీగా పనిచేశారు. ఆ సమయంలో వీరిద్దరి మధ్య స్నేహం ఉందని, ఆ కారణంతోనే ఆమెను ఎమ్మెల్సీగా మీనాక్షి ఢిల్లీ పెద్దలకు సిఫారసు చేసి ఉండవచ్చని అంటున్నారు. తెలంగాణలో పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత విజయశాంతి గురించి పార్టీ నాయకత్వం పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆమె కూడా గుంభనంగా అంటూ అదను చూసి తన సత్తా నిరూపించుకుందని అభిమానులు చెబుతున్నారు.

# "ఎక్స్"పై సైబర్‌దాడి వారి పనే..!: ఎలాన్ మస్క్



వాషింగ్టన్,అనేక దేశాల్లో సోమవారం సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్ సర్వీసుల్లో తీవ్ర అంతరాయం కొనసాగింది. దీంతో యూజర్లు ఎక్స్‌ను వాడుకోలేకపోయారు. దీంతో 'ఎక్స్' యాజమాని ఎలాన్ మస్క్ దీనిపై స్పందిస్తూ క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు.ఎక్స్‌పై భారీ సైబర్ దాడి జరిగిందన్నారు. తాము ప్రతిరోజు సైబర్ దాడిని ఎదుర్కొంటున్నప్పటికీ, ఇప్పుడు జరిగిన సైబర్‌దాడి వెనక ఓ పెద్ద గ్రూప్, ఓ దేశం ఉందని తాము అనుమానిస్తున్నట్లు చెప్పారు.ఈ దాడి ఎలా జరిగిందో తెలుసుకునేందుకు తమ టీమ్ పనిచేస్తోందని ఎలాన్ మస్క్ తెలిపారు. ఈ సైబర్ దాడి వెనుక యుక్రెయిన్ హస్తం ఉండవచ్చని అన్నారు. ప్రస్తుతం కచ్చితంగా ఏం జరిగిందో చెప్పలేకపోతున్నామని తెలిపారు.ఈ దాడిని తమ ఎక్స్ సిస్టమ్‌కు అంతరాయం కలిగించేందుకే చేశారని ఎలాన్ మస్క్ అన్నారు. ఈ దాడికి సంబంధించిన ఐపీ అడ్రస్‌లు యుక్రెయిన్ ప్రాంతానికి చెందినవని తెలుస్తోందని తెలిపారు. ఈ దాడికి సంబంధించిన ఇతర వివరాలు మస్క్ చెప్పలేదు.యుక్రెయిన్, అమెరికా మధ్య సత్సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో ఈ సైబర్ దాడి జరగడం గమనార్హం. గత నెలలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, యుక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీని 'నియంత' అని పిలిచారు. ఆ తర్వాత ఇద్దరి మధ్య ఓవల్ ఆఫీస్‌లో సమావేశం జరిగింది. అందులో ఇరువురు నేతలు పరస్పరం విమర్శలు చేసుకున్న తీరు ప్రపంచాన్ని ఆశ్చర్యపర్చింది.మరోవైపు, రష్యా –యుక్రెయిన్ మధ్య చాలా కాలంగా యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో ఎలాన్ లాన్ తాజాగా పలు వ్యాఖ్యలు చేశారు. యుక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ యుద్ధాన్ని శాశ్వతంగా కొనసాగేలా చేస్తున్నారని మండిపడ్డారు. తాము ఒకవేళ స్టార్‌లింక్ ఇంటర్నెట్ సర్వీసులను ఆపేస్తే యుక్రెయిన్ సేనలు కుప్పకూలుతాయని చెప్పారు.

# తెలంగాణ బీజేపీ పగ్గాలు ఈటలకే.. లైన్ క్లియర్ అయ్యిందా?



హైదరాబాద్,ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్ష పగ్గాలు ఎవరికన్న విషయంలో అధిష్టానం ఒక నిర్ణయానికి వచ్చేసిందా? గత కొంత కాలంగా అధ్యక్ష పదవికి ఎవరిని ఎంపిక చేయాలన్న విషయంలో కమలనాథులు చేస్తున్న కసరత్తు ఒక కొలిక్కి వచ్చేసిందా? అంటే పార్టీ వర్గాలే కాదు పరిశీలకులు కూడా ఔననే సమాధానం ఇస్తున్నాయి. బీజేపీ అధ్యక్ష పదవి కోసం పోరులో అధిష్ఠానం జోక్యంతో లైన్ క్లియర్ అయిపోయిందనే అంటున్నారు. బీసీ వర్గానికి చెందిన ఈటలకే అధిష్ఠానం అధ్యక్ష పగ్గాలు కట్టబెట్టనున్నదని చెబుతున్నారు. ఇటీవల ఈటల ఢిల్లీ వెళ్లి ప్రధాని నరేంద్రమోడీతో భేటీ అవ్వడంతో. పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం కసరత్తును పార్టీ అగ్రనాయకత్వం ముగించేయడమే కాకుండా, ఈటలనే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపిక చేసేసిందని అంటున్నాయి. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో అధికారం చేపట్టడమే లక్ష్యం అంటూ బీజేపీ అగ్రనాయకత్వం తీసుకున్న కొన్ని చర్యలు, నిర్ణయాలు బూమరాంగ్ అయ్యాయి. దీంతో అప్పట్లో అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ అనుకున్నంతగా పెర్ఫార్మ్ చేయలేక చతికిల పడింది. అధికారం సంగతి అటుంచి కనీసం ప్రతిపక్ష హెూదాకు అవసరమైనన్ని స్థానాలు కూడా సంపాదించలేకపోయింది. ఎప్పటిలాగే సింగిల్ డిజిట్ తో సరిపెట్టుకోవలసి వచ్చింది. దీంతో సార్వత్రిక ఎన్నికల సమయంలో కొన్ని దిద్దుబాటు చర్యలు తీసుకుంది. అవి కొంత మేర ఫలించి కాంగ్రెస్ తో సమానంగా రాష్ట్రంలో లోక్ సభ స్థానాలను గెలుచుకోగలిగింది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల తరువాత తెలంగాణలో బీఆర్ఎస్ పూర్తిగా డీలా పడిపోవడం వల్లనే బీజేపీ ఆ మాత్రం లోక్ సభ స్థానాలను గెలుచుకోగలిగిందని కమలనాథులకు అర్థమైంది. ఇప్పుడు ఇక రాష్ట్రంలో పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టింది. గత ఏడాది జరిగిన రాష్ట్ర ఎన్నికల సమయంలో చేసిన పొరపాట్లను సరిదిద్దుకునేందుకు సమాయత్తమౌతోంది. అందులో భాగంగానే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి కోసం అన్వేషణ ప్రారంభించింది. గత ఎన్నికలకు ముందు వరకూ రాష్ట్ర అధ్యక్ష పగ్గాలు చేపట్టిన బండి సంజయ్ రాష్ట్రంలో పార్టీన బలోపేతం చేయడమే కాకుండా.. బీజేపీని అప్పటి అధికార బీఆర్ఎస్ తో దీటుగా తలపడే స్థాయికి ఎదిగేలా చేశారు. అయితే ఆ తరువాత జరిగిన పరిణామాలతో ఆయనను పార్టీ హైకమాండ్ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించింది. ఆయన స్థానంలో కిషన్ రెడ్డికి పగ్గాలు అప్పగించింది. అయితే పార్టీ అగ్రనాయకత్వం తీసుకున్న ఈ చర్య సానుకూల ఫలితాల సంగతి అటుంచి పార్టీలోనే తీవ్ర నిరసనను ఎదుర్కొంది. దీంతో అసెంబ్లీ ఎన్నికలలో అంచనాలను అందుకోలేకపోయింది. సార్వత్రిక ఎన్నికలలో పార్టీ ఓ మేరకు మెరుగైన ఫలితాలను సాధించగలిగినా, ఆ క్రెడిట్ మాత్రం కిషన్ రెడ్డి ఖాతాలో పడలేదు. కిషన్ రెడ్డికి కేంద్ర మంత్రి బాధ్యతలు కూడా ఉండటంతో ఆయన స్థానంలో కొత్త అధ్యక్షుడిని ఎపింక చేసి నియమించాలని నిర్ణయించింది.అయితే తెలంగాణలో పార్టీలో అంతర్గత కుమ్ములాటల కారణంగా కొత్త అధ్యక్షుడి ఎంపిక వాయిదాల మీద వాయిదాలు పడుతూ వస్తోంది. గత కొన్ని రోజులుగా పార్టీ రాష్ట్ర పగ్గాలు మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ కు కట్టబెట్టనున్నారన్న వార్తలు గట్టిగా వినిపించాయి. అయితే ఈటలకు పార్టీ రాష్ట్రపగ్గాలు అప్పగించే విషయంలో బండి సంజయ్, కిషన్ రెడ్డి సహా పలువురు నేతలు తీవ్ర వ్యతిరేకత కనబరిచారు. దీంతో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని మార్చే విషయంలో బీజేపీ వెనకడుగు వేసింది. కిషన్ రెడ్డినే కొనసాగించింది. అయితే ఇప్పుడిక హైకమాండ్ మల్లగుల్లాలకు చెక్ పెట్టేసిందని వినిపిస్తోంది. ఒక వైపు ఎంత వ్యతిరేకత పొడసూపినా కర్నాటక బీజేపీ పగ్గాలు గాలి జనార్దన్ రెడ్డికి అప్పగించేందుకు రెడీ అయిపోయిన బీజేపీ అగ్రనాయకత్వం అదే సూత్రాన్ని తెలంగాణలోనూ అమలు చేసి ఈటలను కన్ ఫర్మ్ చేసేసిందని అంటున్నారు. అందుకు తార్కానంగా ఈటల సతీసమేతంగా హస్తిన వెళ్లి మోడీతో భేటీ కావడాన్ని చూపుతున్నారు.

## పిహెచ్‌డి ప్రవేశ పరీక్ష గడువు పొడిగింపు

హైదరాబాద్, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని ఫ్యాకల్టీల కేటగిరి 2 పీహెచ్‌డీ సీట్ల భర్తీకి నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసేందుకు గడువును పొడిగించినట్లు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి తెలిపారు. రూ. 2000 అపరాధ రుసుముతో ఈనెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చేనెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com